# నేషనల్ న్యూస్ NATIONAL NEWS REPORTER రిపోర్టర్



విలేకరులు కావలెను
నేషనల్ న్యూస్ NATIONAL NEWS REPORTER రిపోర్టర్ RNI:APTEL/25/A2293
నేషనల్ న్యూస్ రిపోర్టర్‌గా ఆంధ్ర మరియు తెలంగాణ ప్రాంతాలలో పనిచేయుటకు విలేకరులు కావలెను
అర్హత: నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే సత్తా ఉండాలి.
సంప్రదించండి
7668886666
8549845435



సంపుటి: 01, సంచిక: 281 ఎడిటర్: కొట్లపల్లి ఫౌజియ పేజీలు: 08 వెల : రూ.1/- సోమవారం -01 - జూన్ - 2026


## ఇండియా ఒక 'పవర్ ఫుల్' కంట్రీ

- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ఒక కీలక శక్తి అని కొనియాడిన అమెరికా




- సింగపూర్‌లోని షాంగ్రి-లా సదస్సులో యూఎస్ రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వ్యాఖ్యలు
- భారత్ తన సైన్యాన్ని వేగంగా ఆధునికీకరిస్తోందని ప్రశంస
- మిత్రదేశాలు రక్షణ వ్యయాన్ని పెంచాలని అమెరికా పిలుపు

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ఒక 'శక్తివంతమైన దేశం' అని, ప్రాంతీయ బలాల సమతుల్యతకు కీలకమైన శక్తిగా నిలుస్తోందని అమెరికా రక్షణ శాఖ మంత్రి మిగతా 2లో

## రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం..



- రాజస్థాన్ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.
- శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇసుక తుపాను తీవ్ర బీభత్సం సృష్టించింది.

రాజస్థాన్ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇసుక తుపాను తీవ్ర బీభత్సం సృష్టించింది. థార్ ఎడారి నుంచి వీచిన బలమైన గాలుల కారణంగా ఆకాశమంతా ఇసుక రేణువులు కమ్ముకొని, మిగతా 2లో

సమసిపోయిన వివాదాన్ని మళ్లీ రెచ్చగొడితే వారికే నష్టం..

## సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించుకోవాలి




- కూటమిని విడగొట్టేందుకే నీచ రాజకీయాలు..
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెనుక రాజకీయ కుట్ర.. తెలంగాణ నేతల హెచ్చరికలకు భయపడేది లేదు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్
- ఏపీ ప్రగతిని చూసి ఓర్వలేకే కంటగింపు.. భీమవరం మీడియా సమావేశంలో తెలంగాణ పరిణామాలపై స్పందించిన బీజేపీ అధ్యక్షులు మాధవ్

భీమవరం : జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పైన తెలంగాణలో జరుగుతున్న ఆందోళనల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, పొరుగు రాష్ట్రానికి చెందిన కొందరు చేస్తున్న హెచ్చరికలకు ఇక్కడ ఎవరూ భయపడే ప్రసక్తే లేదని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ స్పష్టం చేశారు. మిగతా 2లో

వాళ్ల వల్లే కాలేదు..

## వీళ్లతో అవుతుందా?

- హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
- పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.
- తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘనవిజయం సాధించిందని పేర్కొన్నారు.
- మహానాడును సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.
- 'తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

**మహానాడు విజయవంతం..**

**నేతలు, కార్యకర్తలకు సీఎం చంద్రబాబు అభినందనలు**

**పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు భేటీ**

**ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి**



హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం మిగతా 2లో

మే 31 నుంచి ధవళేశ్వరం

## కాలువలకు నీటి విడుదల

ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు: మంత్రి కందుల దుర్గేష్!
మే 31 నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి
కాలువలకు నీరు విడుదల చేయాలని నిర్ణయం
సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామన్న దుర్గేష్
నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధం కావాలని సూచన



సోము

తూర్పుగోదావరి జిల్లా: నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మిగతా 2లో

మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క

## పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు



- సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం
- పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం
- సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన
- విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం

దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ మిగతా 2లో

'కాంగ్రెస్‌తో చంద్రబాబు

## హాట్ రాజకీయాలు చేస్తున్నారు'

**చంద్రబాబు వైఖరిని బీజేపీ బాగా అబ్జర్వ్ చేస్తుంది.**

- మోసపూరిత రాజకీయాలు చేయడంలో చంద్రబాబు నెంబర్ వన్ అని విమర్శించారు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు.
- బహిరంగంగా బీజేపీతో ఉంటూ తెరచాటున కాంగ్రెస్‌తో ఉంటున్నారని అంబటి విమర్శించారు



మోసపూరిత రాజకీయాలు చేయడంలో చంద్రబాబు నెంబర్ వన్ అని విమర్శించారు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు. మిగతా 2లో

ఆర్టీసీని ప్రైవేటీకరించే

## ఆలోచన ప్రభుత్వానికి లేదు

**ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించబోతున్నారంటూ ప్రచారం**

- నిరసనలకు దిగిన ఎంప్లాయీస్ యూనియన్
- ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్న రాంప్రసాద్ రెడ్డి
- ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ కాబోతోందంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే.



ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ కాబోతోందంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. మిగతా 2లో

## స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్రలో మంత్రి సంధ్యారాణి ప్రత్యేక కార్యక్రమాలు




- స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సాలూరు మెంటాడ వీధిలోని 1, 2 వార్డుల్లో కాలువలు, వీధుల పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- ప్రజలతో మమేకమవుతూ వీధుల్లో అరుగులపై కూర్చొని మహిళలతో కలిసి కాఫీ తాగారు.

స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సాలూరు మెంటాడ వీధిలోని 1, 2 వార్డుల్లో కాలువలు, వీధుల పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమవుతూ వీధుల్లో అరుగులపై కూర్చొని మహిళలతో మిగతా 2లో

- ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు.
- ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు
- ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.
- ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు.
- ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను

## సందర్శించిన పవన్ కల్యాణ్

**నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ**

**ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్**

**కాకినాడ జిందాల్ ప్లాంట్ పై ఆరా తీసిన డిప్యూటీ సీఎం**



ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ ప్రతినిధులతో మాట్లా డిన పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను మిగతా 2లో

## "అందుకే చంద్రబాబు పాత కథనే మళ్లీ తెరమీదకు తెచ్చారు"



- చంద్రబాబు నాయుడు ఈ రెండేళ్లలో ఏపీని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చెప్పారు.
- సంపద సృష్టించి దాన్ని పేద ప్రజలకు పంచుతానన్న మాట గాలిమాటగా మిగిలిపోయిందని విమర్శించారు.

చంద్రబాబు నాయుడు ఈ రెండేళ్లలో ఏపీని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చెప్పారు. సంపద సృష్టించి మిగతా 2లో

# ఇండియా ఒక 'పవర్ ఫుల్' కంట్రీ

పీట్ హెగ్సెత్ ప్రశంసించారు. సింగపూర్‌లో శనివారం జరిగిన 'షాంగ్రి-లా డైలాగ్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఆసియాలోనే అతిపెద్ద రక్షణ, భద్రతా వేదిక అయిన ఈ సదస్సులో హెగ్సెత్ మాట్లాడుతూ, భారత్ తన సైన్యాన్ని వేగంగా ఆధునికీకరించుకుంటోందని అన్నారు. "ఉన్నత స్థాయి సైనిక కార్యకలాపాలను నిర్వహించేందుకు భారత్ భారీ పారిశ్రామిక, లాజిస్టిక్స్ సామర్థ్యాలను నిర్మించుకుంటోంది. దక్షిణాసియాలో, ప్రాంతీయ సమతుల్యతను కాపాడటంలో భారత్ ఒక కీలక శక్తి. శక్తివంతమైన భారత్ తన సొంత ప్రయోజనాల కోసం పనిచేయడంతో పాటు, ఈ ప్రాంతంలో బలాల సమతుల్యతను కాపాడాలనే మా ఉమ్మడి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళుతోంది" అని ఆయన స్పష్టం చేశారు.అమెరికా-భారత్ మధ్య పెరుగుతున్న రక్షణ సహకారాన్ని, ముఖ్యంగా సైనిక సామర్థ్యాలను పెంచేందుకు ఉద్దేశించిన సంయుక్త కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ ప్రాంతంలో చైనా సైనిక విస్తరణపై ఆందోళన వ్యక్తం చేసిన హెగ్సెత్, మిత్రదేశాలు భద్రతా బాధ్యతల్లో మరింత పాలుపంచుకోవాలని, రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కొన్ని దేశాలు తమ జీడీపీలో 3.5 శాతం రక్షణకు కేటాయించాలని ఆయన సూచించారు.ఇరాన్ వంటి ఇతర అంతర్జాతీయ అంశాలపై దృష్టి సారించినప్పటికీ, ఇండో-పసిఫిక్ ప్రాంతంపై అమెరికాకు ఉన్న ప్రాధాన్యం తగ్గలేదని ఆయన స్పష్టం చేశారు. 2025లో భారత్-అమెరికా దేశాల మధ్య కుదిరిన పదేళ్ల రక్షణ ఒప్పందం పునాదిగా ఈ సహకారం మరింత బలపడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం..

పగటిపూటే ఒక్కసారిగా చీకట్లు ముసురుకోవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ముఖ్యంగా పశ్చిమ రాజస్థాన్‌లోని చురు, బీకనీర్, హనుమాన్‌గఢ్, గంగానగర్ జిల్లాలపై ఈ తుపాను ప్రభావం తీవ్రంగా చూపింది. చురూ పరిసర ప్రాంతాల్లో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో భీకరమైన ఈదురు గాలులు వీచాయి. భారీ ఎత్తున లేచిన ఇసుక మేఘాలు యావత్ ప్రాంతాన్నీ చుట్టేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.తీవ్రమైన ఇసుక తుపాను ముగిసిన వెంటనే వాతావరణం చల్లబడింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, అంతకుముందు సంభవించిన ఇసుక తుపాను సృష్టించిన బీభత్సం వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అంతకుముందు శుక్రవారం కూడా రాజధాని జైపూర్‌లో ఇలాంటి భీకర వాతావరణమే కనిపించింది. నిన్న ధోల్‌పుర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో మారుతున్న ఈ వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. జైపూర్‌లోని వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌లో ఈ తరహా ఇసుక తుఫానులు, ఈదురు గాలులతో కూడిన వాతావరణం మరో నాలుగైదు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# సమసిపోయిన వివాదాన్ని మళ్లీ రెచ్చగొడితే వారికే నష్టం.. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించుకోవాలి

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం విచ్చేసిన ఆయన శనివారం స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణలో పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై విలేకరులు ఆయన దృష్టికి తీసుకురావడంతో దానిపై ఆయన స్పందించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. భారతదేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చీణూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోందని, ఈ ప్రగతిని చూసి ఓర్వలేకే కొందరు కుట్రదారులు కంటగింపుతో వ్యవహరిస్తున్నారని మాధవ్ మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని కూటమికి నష్టం కలిగించాలనే పక్కా ప్రణాళికతోనే ఈ నీచ రాజకీయాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. ఎలాగైనా సరే ఏపీలో అత్యంత పటిష్టంగా ఉన్న కూటమిని విడగొట్టాలనే దురాలోచనతోనే తెలంగాణ వేదికగా ఈ కుట్రలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా, ఎక్కడికైనా స్వేచ్ఛగా తిరగొచ్చని.. అలాంటప్పుడు పర్యటనలను అడ్డుకుంటామంటూ హెచ్చరికలు చేయడం తగదన్నారు. ?ఒక రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఉన్నత స్థాయి వ్యక్తి చిత్రపటాన్ని అవమానించడం అత్యంత హేయమైన చర్య అని పి.వి.ఎన్. మాధవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే సమసిపోయిన ఒక వివాదాన్ని మళ్లీ కావాలనే రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి దిగజారుడు సంస్కృతి ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని హితవు పలికారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు అక్కడి నేతలు కూడా ఈ తరహా పరిణామాలపై పునరాలోచించుకోవాలని, లేనిపక్షంలో ఇవి వారికే తీవ్ర నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. రెండు రాష్ట్రాల సమాన ప్రగతిని కాంక్షించేది కేవలం బీజేపీ, కూటమి ప్రభుత్వాలు మాత్రమేనని గుర్తుచేసిన మాధవ్, తెలంగాణ నేతలు అసంబద్ధ ప్రేలాపనలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

(సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు.సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది.ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు.భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

# స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్రలో మంత్రి సంధ్యారాణి ప్రత్యేక కార్యక్రమాలు

కలిసి కాఫీ తాగారు. ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా మంత్రి స్కూటర్‌పై కార్యక్రమ స్థలానికి చేరుకోవడం ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఖరీఫ్-2026 సీజన్‌కు రైతులకు భారీ ఎత్తున రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన 22,348 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. ఇందులో 8,883 క్వింటాళ్ల వరి విత్తనాలను గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 802 టార్పాలిన్లు, 14 ఆయిల్ ఇంజన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. సాలూరు నియోజకవర్గ రైతులకు 8,100ుావీణూ కిట్లను కూడా పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు భూమిలో తేమ నిల్వ ఉండి, రైతుల ఆదాయం పెరగడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

# "అందుకే చంద్రబాబు పాత కథనే మళ్లీ తెరమీదకు తెచ్చారు"

దాన్ని పేద ప్రజలకు పంచుతానన్న మాట గాలిమాటగా మిగిలిపోయిందని విమర్శించారు. రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి శనివారం వైఎస్సార్ జిల్లాలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "ఈ ప్రభుత్వ వైఫల్యాలపై మా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద ఎత్తున జూన్ 4 నుంచి నిరసన కార్యక్రమాలు ప్రకటించారు. ఈ తరుణంలో ప్రజల దృష్టిని మరల్చడానికి చంద్రబాబు మళ్లీ డైవర్షన్ పాలిటిక్స్ తెరమీదకు తెచ్చారు. దీనిలో భాగంగానే పాత కథనే.. మళ్లీ లిక్కర్ స్కాం అంటూ తెరమీదకు తెచ్చారు. వైఎస్ జగన్‌ను నేర చరిత్ర కలిగిన వ్యక్తిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు.అసలే స్కామే లేనిచోట స్కాం అంటారు.. సంబంధం లేని వారినందరినీ అందరినీ ఇబ్బంది పెడుతున్నారు. అసలు ఏ ఆధారం లేకపోయినా చంద్రబాబు నియమించిన సిట్ ఏదో ఒక విధంగా మావాళ్లను ముద్దాయిలుగా చూపించి జైలుకు పంపింది. మిథున్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి అందరికీ బెయిల్ వచ్చింది. చంద్రబాబు నమ్మదగిన మిత్రుడు కాదని, ఇన్‌స్టాంట్ కాఫీ లాంటివాడేనని పవన్ కల్యాణ్‌కు అమిత్ షా స్పష్టంగా చెప్పారు.వైఎస్ జగన్ దీర్ఘకాలికంగా స్నేహం చేయడానికి అర్హత కలిగిన వ్యక్తి అని అమిత్ షా స్పష్టంగా చెప్పారు. చంద్రబాబుకు వ్యతిరేకులందరూ మనకు వ్యతిరేకులు కానవసరం లేదని ఆయన చెప్పి పంపించారు. వైఎస్ జగన్‌తో ఎవరైతే ఆత్మీయంగా ఉంటారో వారందరికీ నోటీసులిచ్చి విచారణ పేరుతో వేధిస్తూనే ఉన్నారు. వ్యాపారంలో రూ.19 కోట్ల బ్యాంక్ అకౌంట్ ద్వారా లావాదేవీలు జరిగితే ఏ రకంగా అది లిక్కర్ స్కాంకు సంబంధం? కేవన్నార్ 2007 నుంచీ ఇన్‌కం టాక్స్ చెల్లిస్తూ ఉన్నారు. ఆయన ఆర్థిక లావాదేవీలన్నీ లీగల్‌గానే ఉంటాయి. ఎవరైనా చూసుకోవచ్చు. కేవన్నార్ బాధ్యత ఏంటి..? అతని స్థాయి ఏంటి..? దీనిలో అతనికి ఏం సంబంధం..? చంద్రబాబు కుమారుడు లోకేశ్ లక్షల కోట్లకు ఏ విధంగా అధిపతి కాగలిగారు? రెండెకరాల నుంచి రూ.లక్ష కోట్లకు చంద్రబాబు అధిపతి అయినప్పుడు కేవన్నార్ లాంటి వారు రూ.20 కోట్లు సంపాదించడం తప్పా..? పచ్చళ్లు అమ్ముకున్న రామోజీరావు...ఇప్పుడు వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యారు? రామోజీరావు చిట్‌ఫండ్ పేరుతో ఖాతాదారుల సొమ్ముతో వ్యాపారాలు చేయలేదా? సైకిల్‌పై కిరసనాయిల్ అమ్ముకునే రాధాకృష్ణ ఇవాళ కోట్లకు అధిపతి ఎలా అయ్యారు.

# వాళ్ల వల్లే కాలేదు.. వీళ్లతో అవుతుందా?

నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘనవిజయం సాధించిందని పేర్కొన్నారు. మహానాడును సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే.. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు. టీడీపీ పుట్టిందే తెలంగాణ గడ్డపై, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33% మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని అన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ నేతలతో టీడీపీ కేంద్ర కార్యాలయమైన ఎన్టీఆర్ భవన్లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు తమకు రాజ్యసభ అవకాశం కల్పించాలని కోరారు. వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్ రావు, రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి చంద్రబాబును కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు సీఎం.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమై తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు.రాజ్యసభ స్థానాలతో పాటు, ఇటీవల ముగిసిన పార్టీ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'మహానాడు' తదుపరి కార్యాచరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మరియు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ విమర్శలను తిప్పికొట్టే వ్యూహాలపై అందుబాటులో ఉన్న నేతలతో చంద్రబాబు చర్చించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, కూటమి నేతలతో చర్చించిన తర్వాతే రాజ్యసభ అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని చంద్రబాబు ఆశావహులకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఆయుధాలు పట్టిన నక్సలైట్లే గన్ ద్వారా రాజ్యాధికారాన్ని సాధించలేకపోయారని, అలాంటిది వీళ్లు గొడ్డళ్లతో రాజకీయాలు చేస్తూ ఎలా నెగ్గుకురాగలరని సీఎం చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. ఎన్టీఆర్ భవన్ లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ హత్య రాజకీయాలు చేసిన వాళ్లు రాష్ట్రాన్ని ఏలవచ్చు కానీ, బాధితులు మాత్రం జిల్లా రాజకీయాలు కూడా చేయకూడదనే విచిత్రమైన సిద్ధాంతాన్ని వైసీపీ వాళ్లు నమ్ముతున్నారని ఆయన విమర్శించారు. నేటి తరం యువతకు కూడా వీరి ఫ్యాక్షనిజం, కుట్రల గురించిన పూర్తి విషయాలు ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత చేస్తున్న పోరాటంలో పూర్తి న్యాయం ఉందని చంద్రబాబు మద్దతుగా నిలిచారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు కూతురిగా ఆమెకు ఖచ్చితంగా ఉంటుందని, సునీత ఒంటరిగా చేసిన ఈ న్యాయపోరాటం వల్లే నేటికీ ఆ కేసు సజీవంగా ఉందన్నారు. బాధితులకు అండగా ఉంటూ, ఇలాంటి ఘోరాలకు పాల్పడిన వారిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టడం అందరి బాధ్యతని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.ఆంధ్రప్రదేశ్‌లో 'సైకో' అనే పదం కంటే 'గొడ్డలి పార్టీ' అనే అంశాన్నే ప్రజలు బలంగా గుర్తించారని, ఈ నిజాలు బయటపడే కొద్దీ అవతలి వైపు ఫ్రస్టేషన్ పెరిగిపోతోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వైఎస్ కుటుంబానికి సంబంధించిన కొన్ని అరాచకాలు ఇప్పుడు వెలుగులోకి వస్తుండటం చూసి తానే ఆశ్చర్యపోతున్నానని అన్నారు. మూడు దశాబ్దాల క్రితమే కడప జిల్లాలోని పాలెగాళ్ల రాజ్యంపై వచ్చిన పుస్తకాన్ని ఇప్పుడు సమాజం మొత్తం చదువుతోందని, ఇలాంటి హింసాత్మక ప్రవృత్తి గలవారు ప్రజాస్వామ్యానికి ఏమాత్రం పనికిరారని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు."డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు శాఖను ఆదేశించారు. ఏళ్ల తరబడి కష్టపడి దాచుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచుకుంటుంటే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఈ పరిస్థితిని అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని సైబర్ నేర రహితంగా మార్చడమే లక్ష్యమని, ఏపీ ప్రజలను మోసం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని ఆయన హెచ్చరించారు. సచివాలయంలో సైబర్ నేరాల కట్టడిపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో సైబర్ నేరాలను సమూలంగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. దీనికి సంబంధించిన కార్యాచరణను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రికి వివరించారు. ఆరు స్తంభాల (6 పిల్లర్స్) ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్‌బోర్డ్, టెక్నాలజీ-ఏఐ వినియోగం, పోలీసులకు శిక్షణ, 3-టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటివి ఉంటాయని పేర్కొన్నారు.మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్'లో అత్యాధునిక సదుపాయాలతో రాష్ట్రస్థాయి సైబర్ వార్ రూం ఏర్పాటు చేస్తున్నామని, ఇది 30 రోజుల్లో అందుబాటులోకి వస్తుందని డీజీపీ తెలిపారు. సైబర్ మోసంపై ఫిర్యాదు అందిన వెంటనే 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, గోల్డెన్ అవర్ టైంలో స్పందించి బాధితుల డబ్బు బదిలీ కాకుండా చూడాలని సీఎం సూచించారు. ఇందుకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు.పోలీసు పెట్రోలింగ్ తరహాలోనే 'సైబర్ పెట్రోలింగ్' కూడా నిరంతరం జరగాలని చంద్రబాబు అన్నారు. నేరం జరగకముందే ప్రజలను అప్రమత్తం చేయడంపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాలపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి వీబశ్రీవఎబత్‌వతీ౹ూ× వంటి టెక్నాలజీలను వాడతామని, ఏడాదిలో 500 మంది పోలీసు అధికారులకు శిక్షణ ఇస్తామని డీజీపీ వివరించారు. 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు, 4 ప్రాంతీయ హబ్‌లు ఏర్పాటు చేసి నేరాలకు అడ్డుకట్ట వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు.ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా... రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు.పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

పల్నాడు జిల్లా కొండవీడు పరిధిలోని జిందాల్ 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో చెత్తను సేకరించడం దగ్గర నుంచి బాయిలర్‌లో అది బూడిదగా మారే వరకూ.. ప్రక్రియను ఆసక్తిగా పరిశీలించారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ విధానంపై ప్లాంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా అధికారులు, ప్లాంట్ నిర్వాహకులకు ఉప ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిందాల్ పరిశ్రమ తరహాలోనే గోదావరి నదీ కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ సాంకేతికతను ఎలా అనుసంధానం చేయవచ్చో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో చెత్తను వేరు చేసి, దాన్ని విద్యుత్ తయారీకి ఉపయోగించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.రాష్ట్రంలో రోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా మరిన్ని 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఇందుకోసం దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా పేరొందిన 'ఇండోర్ మోడల్' తరహాలో చెత్తను పద్ధతిగా, పారదర్శకంగా వేరు చేసేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు.. ప్లాంట్ అధికారులు ఉప ముఖ్యమంత్రికి అంతర్జాతీయ, జాతీయ స్థాయి గణాంకాలను వివరించారు. సింగపూర్‌లో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 2.8 శాతం కేవలం ఇలాంటి చెత్త ప్లాంట్ల నుంచే లభిస్తోందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ గ్రిడ్‌తో ఈ వ్యర్థ ఆధారిత విద్యుత్ ప్లాంట్ల అనుసంధానం చాలా అద్భుతంగా ఉందని అధికారులు ప్రశంసించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సరఫరా వృథా శాతం అత్యంత తక్కువగా ఉండటం విశేషమని డిప్యూటీ సీఎంకు ఈ సందర్భంగా ప్లాంట్ అధికారులు తెలియజేశారు.జిందాల్ ప్లాంట్ ఏర్పాటు వ్యయం, నిర్వహణ తీరుపై ప్లాంట్ ప్రతినిధులను, అధికారులను రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలను ఆయనకు ప్రతినిధులు వివరించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇప్పటివరకు ఎందుకు వినియోగంలోకి రాలేదని పవన్ ప్రశ్నించారు. రాబోయే నవంబర్ నాటికి ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.నదుల్లో కాలుష్యాన్ని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళికలతో రావాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. విద్యుత్ ప్లాంట్ల వల్ల ఏర్పడే కాలుష్యంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు. కాలుష్య నియంత్రణకు సంబంధించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (ూజీ) ఏడాదికి నాలుగుసార్లు నివేదికలు ఇస్తోందని జిందాల్ ప్రతినిధులు వివరించారు. ఇదే విధానాన్ని ఆంధ్రా పేపర్ మిల్లులో ఎందుకు పాటించడం లేదని అధికారులను పవన్ నిలదీశారు.కాలుష్య నియంత్రణ నిబంధనల అమలులో పారదర్శకత ఉండాలని, పర్యావరణ పరిరక్షణకు అన్ని పరిశ్రమలు కట్టుబడి ఉండాలని ఈ సమీక్షలో పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్లాంట్ల నిర్వహణతో పాటు స్థానిక పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పవన్ కల్యాణ్ సూచించారు.మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

# 'కాంగ్రెస్‌తో చంద్రబాబు హాట్ రాజకీయాలు చేస్తున్నారు'

బహిరంగంగా బీజేపీతో ఉంటూ తెరచాటున కాంగ్రెస్‌తో ఉంటున్నారని అంబటి విమర్శించారు. కాంగ్రెస్‌తో చంద్రబాబు హాట్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు అంబటి. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన అంబటి.. బీజేపీని చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని కాంగ్రెస్ సీఎం ఆవిష్కరించడం సిగ్గుచేటు. కాంగ్రెస్ సీఎంకి టీడీపీ కార్యకర్తలు స్వాగతం పలికారు. ఏపీలో చంద్రబాబుకు కాంగ్రెస్ పార్టీ బీ టీమ్. తెలంగాణలో కాంగ్రెస్‌కు టీడీపీ బీ టీమ్. ఇలాంటి అనైతిక రాజకీయాలు చేయడంలో చంద్రబాబు దిట్ట. చంద్రబాబు వైఖరిని బీజేపీ బాగా అబ్జర్వ్ చేస్తుంది. రాజ్యసభలో బీజేపీకి సీటు ఇవ్వనని చంద్రబాబు అనటం అందుకు సంకేతం. చీరలిచ్చి మహిళలను మహానాడుకు తీసుకెళ్లారు. డబ్బులిచ్చి జనాన్ని తీసుకెళ్లారంటే టీడీపీ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మహానాడులో చంద్రబాబును 25%, లోకేష్ ను 75% పొగిడారు. మెగా డీఎస్సీ పేరుతో పోస్టులు అమ్ముకున్న వ్యక్తి నారా లోకేష్. అసలు టీడీపీ పెట్టినప్పుడు చంద్రబాబు కాంగ్రెస్‌లో ఉన్నారు. కాంగ్రెస్‌ను వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరారు. తర్వాత ఎన్టీఆర్‌ని వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి, నారా రామ్మూర్తి నాయుడుని కూడా రాజకీయాల కోసం వాడుకున్న నీచ చరిత్ర చంద్రబాబుది. జూనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ, హరికృష్ణలను కూడా తొక్కేసిన దుర్మార్గుడు చంద్రబాబు. ఇంతకుమించిన వెన్నుపోటుదారుడు ఇంకెవరైనా ఉన్నారా?, అలాంటి వ్యక్తికి జగన్ మీద విమర్శలు చేసే అర్హత లేదు. అప్పట్లో మోదీని దూషించి ఇప్పుడు వంగి వంగి నమస్కారాలు పెడుతున్నారు. కేవన్నార్ మీద ఎల్లోమీడియా నీచపు రాతలు రాస్తోంది. చంద్రబాబు ఆస్తి రెండు ఎకరాల నుండి లక్షల కోట్లు ఎలా సంపాదించారు?, సైకిల్ మీద తిరిగే ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఎక్కడవి?, పచ్చళ్లు అమ్ముకునే రామోజీ, కిరణ్ లకు ఇప్పుడు వేల కోట్ల ఆస్తి ఎలా వచ్చింది?, వైఎస్ఆర్ సీపీని తొక్కేయటం ఎవరితరం కాదు. మా ఇంటి మీద దాడి, విధ్వంసం చేసిన వారిని ఇప్పటికీ ఎందుకు అరెస్టు చేయలేదు?, త్వరలోనే మళ్ళీ నా పోరాటం ప్రారంభిస్తా. మా ఇంటి నుంచి డీజీపీ ఆఫీసు వరకు ర్యాలీగా వస్తా. 29 కిలోమీటర్లు 'వినతి పాదయాత్ర' చేస్తా' అని పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఈరోజు రాష్ట్ర సచివాలయంలో మొదటిసారిగా సమావేశమైంది. కేకే అధ్యక్షతన కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ఎం.కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు.

# ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు

ప్రైవేటీకరణ వార్తల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నిరసనలు చేపట్టింది. ఈ నిరసనల్లో వైసీపీ కూడా పాల్గొంది. మరోవైపు, ఈ ప్రచారంపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఏపీఎస్ఆర్టీసీ ఆర్థికంగా నిలకడగా ఉందని, సంస్థకు రూ. 30 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, ఆర్టీసీ ప్రయాణ ఛార్జీలను పెంచే ఉద్దేశం కూడా లేదని ప్రయాణికులకు తీపి కబురు చెప్పారు.సంస్థను మరింత ఆధునికీకరించేందుకు త్వరలోనే కొత్తగా 2,500 ఎలక్ట్రిక్, 500 సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, కార్మికుల సమస్యలన్నింటినీ రెండేళ్లుగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అవసరమైన ఉద్యోగాలను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారుఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణకాబోతోందని కొద్దిరోజులుగా రాష్ట్రంలో ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఆర్టీసీ కార్మికులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. వీరికి మద్దతుగా నిరసనల్లో వైసీపీ నేతలు సైతం పాల్గొన్నారు. ఆర్టీసీపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టడారు.ఈ నేపథ్యంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. గుంటూరులో ఆయన మాట్లాడతూ ఆర్టీసీని ప్రైవేటీకరించమని స్పష్టం చేశారు. త్వరలోనే 2500 ఈవీ, 500 సీఎన్జీ బస్సులు రాబోతున్నాయని చెప్పారు. ఆర్టీసీ ఛార్జీలను పెంచే ఆలోచనన లేదన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఆర్థికంగా బాగుందని తెలిపారు. రూ. 30 వేల కోట్ల ఆస్తున్నాయని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీఎస్ ఆర్టీసీలో చాలా సమస్యలు పరిష్కరించామని రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయడం కూడా జరిగిందన్నారు. రెండేళ్లుగా ఆర్టీసీ కార్మికులకు కావాల్సిన అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీలో అవసరమైన ఉద్యోగాలు భర్తీ చేస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో విద్యాశాఖ అధికారి పదవి విరమణ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, ఐఏఎస్ అధికారులకు డీఈఓ బాధ్యతలు అప్పగించడం వల్ల వారు విద్య పై పూర్తిస్థాయిలో దృష్టి సారించ లేకపోతున్నట్లు చెప్పారు. తక్షణమే రెగ్యులర్ డీఈఓలను నియమించాలని డిమాండ్ ఛేశారు.

# మే 31 నుంచి ధవళేశ్వరం కాలువలకు నీటి విడుదల

కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించేందుకు నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు.ఎక్కువ ధాన్యాన్ని సేకరిస్తోందని స్పష్టం చేశారు. 52.24 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందానికి గాను, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించగలిగిందని గణాంకాలను వెల్లడించారు.ఇక్కడ పండే నాణ్యమైన సన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటూ, పేద ప్రజలకు మాత్రం ఇతర రాష్ట్రాల నుండి తెచ్చిన నాసిరకం బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం కమీషన్లు, భూ దందాలపైనే శ్రద్ధ పెడుతూ, రైతుల ఉసురు పోసుకుంటున్నాయని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ధాన్యం సేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ధాన్యం తీసుకోదన్నారు. ఇవాళ హైదరాబాద్?లో మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని మీకు చేతగాక కేంద్రంపై విమర్శలా అని ప్రశ్నించారు.

## జనసేనలో అరవ శ్రీధర్ కు ఒక న్యాయం ఆదివాసీ సిద్దార్థకు ఒక న్యాయమా?: ఆదివాసీపార్టీ



అల్లూరి జిల్లా చింతపల్లి ( నేషనల్ న్యూస్ ప్రతినిధి )ఆర్ సాగర్:--- మే 31అగ్రవర్ణాలపార్టీలు ఆదివాసీలను కరివేపాకులాగా వాడుకొని వదిలేస్తున్నాయని,జనసేనలో ఎమ్మెల్యే అరవ శ్రీదర్ కు ఒక న్యాయం, ఆదివాసైనా సిద్దార్థ్ మార్క్ కు ఒక న్యాయమా అని భారత్ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు.జనసేనపార్టీ గూడెంకొత్తవీధి మండల ఉపాధ్యక్షులు ఓ పోలీస్ కేసులో అరెస్ట్ అయినా కారణంగా క్రమశిక్షణలో భాగంగా ఆయన్ని పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంతో నేరం చేసిన అనంతబాబు లాంటి వ్యక్తిని పేరుకు సస్పెండ్ చేసినా రంపచోడవరం నియోజకవర్గంలో అతని కనుసన్నల్లోనే పార్టీ నడిపించారు, కానీ అదే పార్టీలో చాలామంది ఆదివాసీలు వివిధ కేసుల్లో ఇరుక్కుంటే కనీసం పట్టించుకోలేదు. ఇప్పుడు జనసేన పార్టీకి చెందిన మండల ఉపాధ్యక్షులు అరెస్ట్ అయితే పార్టీ సభ్యత్వం ఉంది కానీ పార్టీలో క్రియశీలకంగా లేరని ప్రకటన చేయడం విడ్డురం. నిజానికి సిద్దార్థ్ మార్క్ తప్పు చేయవచ్చునేమో కానీ తప్పుడు మనిషైతే కాదని, ఆదివాసీ ఉద్యమాల పట్లా కమిట్మెంట్ ఉన్న వ్యక్తి.ఆర్థిక పరమైన సమస్యలు చాలామందికి ఉన్నాయి కానీ యువత పెడదారి పట్టవద్దని, అలాగే అగ్రవర్ణాల పార్టీలలో ఉన్న ఆదివాసీలను కరివేపాకు లాగా వాడుకొని వదిలేస్తారన్న విషయాన్ని గమనించగలరు. ఈ రోజు సిద్దార్థ్ రేపు మీరు కావొచ్చునని అగ్రవర్ణాల పార్టీలలో ఉన్న ఆదివాసీలకు హెచ్చరించారు.

## పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించాలి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్....



జగిత్యాల జిల్లా,మే31, నేషనల్ న్యూస్ రిపోర్టర్:జగిత్యాల జిల్లాలో వరి కోతలు జరిగి పూర్తి చేసిన నేపథ్యంలో రైతులు పంట అవశేషాలను ముఖ్యంగా వరి కొయ్యలను బహిరంగంగా కాల్చివేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు.పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూసారం తగ్గిపోతుందని, మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కార్బన్, ఉపయోగకర సూక్ష్మజీవులు. వానపాములు నశించి భూమి సారవంతత క్షీణిస్తుందని పేర్కొన్నారు.పంట అవశేషాల దహనం కారణంగా మంటలు అదుపు తప్పి సమీపంలోని ఆయిల్ పామ్ తోటలు, మామిడి తోటలు మరియు ఇతర పంట పొలాలకు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల రైతులు గణనీయమైన ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో పొడి వాతావరణ పరిస్థితుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీప వ్యవసాయ భూములను దెబ్బతీసే అవకాశం ఉన్నందున రైతులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.అదేవిధంగా, పంట అవశేషాల దహనం వల్ల సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు. విద్యుత్ సరఫరా తీగలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రజలు, రైతులు మరియు విద్యుత్ సిబ్బందికి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజా ఆస్తుల రక్షణ దృష్ట్యా రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను. పంట అవశేషాలను తగలబెట్టడం నిషేధించబడిందని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం రూ.5,000 నుండి రూ.25,000 వరకు జరిమానా విధించడంతో పాటు అవసరమైతే ఇతర చట్టపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.రైతులు పంట అవశేషాలను పొలంలోనే కలియదున్ని, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వంటి ఎరువులను వినియోగించడం ద్వారా వాటిని త్వరగా కుళ్లిపోయేలా చేసి సేంద్రియ ఎరువులుగా మార్చుకోవచ్చని సూచించారు. ఈ విధానం ద్వారా నేలలో పోషకాలు పెరిగి తదుపరి పంటలకు అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు.జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంట అవశేషాల శాస్త్రీయ నిర్వహణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, భూసార పరిరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణతో పాటు సమీపంలోని ఆయిల్పామ్, మామిడి తోటలు, ఇతర పంటలు మరియు విద్యుత్ మౌలిక వసతులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు పంట అవశేషాల దహనానికి పూర్తిగా దూరంగా ఉండాలని జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

## కొయ్యూరు వారపు సంతలో పోలీసుల అవగాహన.

### రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై ప్రజలకు సూచనలు.



కొయ్యూరు మే 31 (నేషనల్ న్యూస్) ప్రతినిధి జీ .కామేష్.అల్లూరి జిల్లా కొయ్యూరు మండల కేంద్రం ఆదివారం వారపు సంతలో పోలీసులు రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, గంజాయి మరియు నాటు సారా నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కొయ్యూరు సి ఐ బి. శ్రీనివాసరావు, ఎస్ఐ కిషోర్ వర్మ మరియు పోలీసు సిబ్బంది సంతను సందర్శించి మారుమూల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, వ్యాపారులు, యువత మరియు మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు మరియు పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, ఏటీఎం పిన్లు ఎవరికీ వెల్లడించరాదని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని సూచించారు.మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించిన పోలీసులు, మహిళలు మరియు బాలికలు ఎలాంటి వేధింపులు ఎదుర్కొన్నా వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అదేవిధంగా గంజాయి వినియోగం, సాగు, నిల్వ, అక్రమ రవాణా, విక్రయాలు చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని వివరించారు. గంజాయి యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, కుటుంబాలు మరియు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. తమ ప్రాంతాల్లో గంజాయి సంబంధిత కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.నాటు సారా తయారీ, రవాణా, విక్రయం, వినియోగం వల్ల ఆరోగ్యానికి తీవ్ర హానులు కలుగుతాయని పేర్కొంటూ, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. నాటు సారా తయారీ లేదా విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి చట్ట అమలుకు సహకరించాలని కోరారు.ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని సీఐ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్ వర్మ, పోలీసు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇండియన్ ఆర్మీలో సేవలకు సిద్ధమైన కొయ్యూరు గిరిజన యువకుడు పాంగి కృష్ణ వంశీ.



కొయ్యూరు మే 31( నేషనల్ న్యూస్) ప్రతినిధి జీ . కామేష్.అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బంగారంపేట గ్రామానికి చెందిన గిరిజన యువకుడు పాంగి కృష్ణ వంశీ ఇండియన్ ఆర్మీలో సేవలందించేందుకు సిద్ధమవడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.బంగారంపేట మాజీ సర్పంచ్ పాంగి రాజుబాబు, ఉమా మహేశ్వరి దంపతుల రెండవ కుమారుడైన కృష్ణ వంశీ, అగ్నివీర్ నియామకాల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. అనంతరం కఠినమైన సైనిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి దేశసేవకు సిద్ధమయ్యారు.మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన యువకుడు దేశ రక్షణ బాధ్యతలు చేపట్టడం పట్ల గ్రామస్తులు, యువత, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణ వంశీ విజయాన్ని ఆదర్శంగా తీసుకుని మరింత మంది గిరిజన యువత సైన్యం, పోలీసు తదితర సేవా రంగాల్లో రాణించాలని ఆకాంక్షిస్తున్నారు.ఈ సందర్భంగా మాజీ జీసీసీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు కాకూరు చంద్రరావు, మాజీ జడ్పీటీసీ గాడి శ్రీరామమూర్తి, మాజీ ఏఎంసీ చైర్మన్ దుచ్చరి చిట్టిబాబు, మాజీ ఎంపీపీ జి. సత్యనారాయణ, ఐటీడీపీ ఇన్చార్జ్ కురుజు శ్రీనుబాబు, మాజీ ఎంపీటీసీ శివరామరాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోర్రు రామూర్తి తదితరులు కృష్ణ వంశీని అభినందించారు.త్వరలో స్వగ్రామానికి రానున్న కృష్ణ వంశీకి గ్రామస్థులు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దేశసేవకు అంకితమైన ఈ గిరిజన యువకుడు మరెన్నో విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# ఏడు స్లాబులు. ఆరు అంతస్తులు. పట్టణ ప్రాణాలిక అధికారుల కళ్లు మూసుకుపోయాయా?

### మాదాపూర్ సర్కిల్ మాత భువనేశ్వరి లేఅవుట్‌లో నిర్మాణ మాఫియా రెచ్చిపోతుంది

### ప్రభుత్వ వ్యవస్థలకే సవాల్ విసురుతున్న అక్రమ నిర్మాణదారులు

### అధికారుల మౌనంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం



రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, మే 31,(నేషనల్ న్యూస్ రిపోర్టర్)శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని జిహెచ్ఎంసి మాదాపూర్ సర్కిల్-50లో అక్రమ నిర్మాణాలు అడ్డూఅదుపు లేకుండా విస్తరిస్తుండటం తీవ్ర కలకలం రేపుతోంది. ముఖ్యంగా మాత భువనేశ్వరి లేఅవుట్ ప్రాంతంలో 200 గజాలలో అనుమతులకు విరుద్ధంగాఏడు స్లాబులతో ఆరు అంతస్తుల భారీ భవనం నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కళ్లుమూసుకుని వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది.ప్రభుత్వ నిబంధనలు, పట్టణ ప్రణాళిక చట్టాలు, పర్యావరణ నియమాలు అన్నీ పక్కనపెట్టి నిర్మాణ మాఫియా బహిరంగంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణం ఒక్కరోజులో ఎదగదని, పునాదుల నుంచి స్లాబుల వరకు అధికారులకు సమాచారం లేకుండా ఇంత భారీ నిర్మాణం సాధ్యం కాదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.మాదాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ బాలకృష్ణ స్వయంగా ఫీల్డ్ అధికారిలా తిరిగిన ఇలాంటి అక్రమ నిర్మాణాలు నిర్భయంగా కొనసాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సర్కిల్ కొత్తగా ఏర్పడిన తర్వాత అక్రమ నిర్మాణదారులు మరింత బరితెగించి వ్యవహరిస్తున్నారని, అధికార యంత్రాంగం పూర్తిగా చేతులెత్తేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.జిహెచ్ఎంసి పేర్లు మారినా, హోదాలు మారినా, అక్రమ నిర్మాణాలపై అధికారుల వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. చట్టాలను గాలికొదిలేసి నిర్మాణాలు కొనసాగిస్తున్న వారిని ఎవరు ప్రోత్సహిస్తున్నారు? ఎవరి అండతో ఈ దౌర్జన్యం సాగుతోంది?, అంటూ ప్రజలు మండిపడుతున్నారు.పచ్చని ప్రకృతిని కాంక్రీట్ అడవిగా మార్చేస్తున్న నిర్మాణ మాఫియా పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో నగర నిర్మాణ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉందని పట్టణాభివృద్ధి నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెరువులు, కాలువలు, ప్రభుత్వ స్థలాలు, నివాస ప్రాంతాలు అన్న తేడా లేకుండా అక్రమ నిర్మాణాలు విస్తరిస్తుండటంతో ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది.అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై పనిచేస్తున్న అధికారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసి, సస్పెన్షన్‌తో పాటు కఠిన శిక్షలు విధించేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ప్రజా సంఘాలు, ప్రకృతి ప్రేమికులు, ప్రజా శ్రేయస్సు కోరే నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణదారులకు మాత్రమే కాదు.. వారికి సహకరించే అధికారులకు కూడా వెన్నులో వణుకు పుట్టించేలా చట్టాలు ఉండాలి. లేకపోతే హైదరాబాద్ నగరం మొత్తం అక్రమ నిర్మాణాల గూటిగా మారే ప్రమాదం ఉంది, అని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

## హన్మకొండ టీబీ ఆసుపత్రిలో డిజిటల్' వసూళ్ల కలకలం.. ఒక్కొక్కరు ?500 'ఫోన్ పే' చేయాలని బాస్ హుకుం.




హనుమకొండ జిల్లా, మే31, నేషనల్ న్యూస్ రిపోర్టర్.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచితంగా జరగాల్సిన సర్వీస్ రికార్డ్ డిజిటలైజేషన్ క్యాష్ చేసుకున్నందుకు ను క్యాష్ చేసుకునెందుకు సుపరిండెండెంట్ స్కెచ్, ఆస్పత్రి అధికారి వాట్సాప్ గ్రూప్ లలోనే వసూళ్ల మెసేజ్,నేటితో ఆదివారం గడువు ముగుస్తుండటంతో ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి ఉన్నతాధికారి వేధింపులపై తిరగబడ్డ సిబ్బంది వాట్సాప్ స్క్రీన్ షాట్ల సాక్షలతో డి ఎం ఈ కి ఫిర్యాదుకు సిద్ధం. హన్మకొండ టీబీ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈ డిజిటల్ వసూళ్ల వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టించింది, ఆసుపత్రిలోని ఒక ఉన్నతాధికారి లేదా సూపరింటెండెంట్, సిబ్బందిని లేదా పేషెంట్లను టార్గెట్ చేసి, కచ్చితంగా ఒక్కొక్కరు ?500 చొప్పున ఫోన్ పే ద్వారా చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడం స్థానికంగా కలకలానికి దారితీసింది,ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా లేదా నామమాత్రపు ప్రభుత్వ ఫీజులతో వైద్య సేవలు అందించాల్సిన చోట, ఇలా డిజిటల్ యాప్స్ ద్వారా అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి, దీనికి సంబంధించిన బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ పనుల ముసుగులో అక్రమ మట్టి దందా, మరిపెడలో మట్టిపై దళారుల కాసుల వేట.




మహబూబాబాద్ జిల్లా, మే 31, నేషనల్ న్యూస్ రిపోర్టర్.మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ మట్టి తవ్వకాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది, స్థానికుల ఆరోపణల ప్రకారం, గత మూడు రోజులుగా రామకృష్ణ వెంచర్ సమీపంలోని 'గొల్ల కుంట' నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా భారీగా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం,ప్రభుత్వ పనుల పేరును ముందుకు తెచ్చి కొందరు దళారులు అక్రమంగా మట్టిని విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి,స్థానిక యువకులు, ప్రజలు కుంట వద్ద జరుగుతున్న తవ్వకాలను గమనించి నిర్వాహకులను ప్రశ్నించగా, "ప్రభుత్వ పనుల కోసం మట్టిని తరలిస్తున్నాం" అనే సమాధానం ఇచ్చినట్లు చెబుతున్నారు, వాస్తవానికి కుంట నుంచి తీసిన మట్టిని ప్రైవేట్ వ్యక్తులకు ట్రిప్పుకు సుమారు రూ.600 చొప్పున విక్రయిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి,ఎండాకాలం వచ్చిందంటే చాలు చెరువులు, కుంటల్లో నీరు ఎండిపోవడాన్ని అవకాశంగా మార్చుకొని, ఎటువంటి అనుమతులు లేకుండానే జేసీబీల సహాయంతో మట్టిని తవ్వడం పరిపాటిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, చట్టరీత్యా నిషేధితమైన ఈ తవ్వకాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి,ప్రభుత్వ ఆస్తిగా ఉన్న కుంటను కొల్ల గొడుతూ, పర్యావరణానికి ముప్పు కలిగించేలా జరుగుతున్న ఈ అక్రమ తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు,"ప్రభుత్వ పనుల పేరిట అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వెంటనే తవ్వకాలను నిలిపివేసి పూర్తి స్థాయి విచారణ జరపాలి" అని ప్రజలు కోరుతున్నారు,అధికారుల స్పందనతోనే అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట పడుతుందా, అనే ప్రశ్న ఇప్పుడు మరిపెడలో చర్చనీయాంశంగా మారింది.

## రాజేంద్రపాలెంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం పాల్గొననున్న ఎమ్మెల్సీ గ్రీష్మ.



కొయ్యూరు మే 31 (నేషనల్ న్యూస్) ప్రతినిధి జీ .కామేష్.పాడేరు నియోజకవర్గ పరిధిలోని కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం హెడ్‌క్వార్టర్‌లో సోమవారం (01-06-2026) ఉదయం 11.00 గంటలకు నిర్వహించనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ పాల్గొననున్నట్లు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు తెలిపారు.ఈ కార్యక్రమానికి పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, ఏఎంసీ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ ఇన్‌చార్జీలు, కన్వీనర్లు, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం,వైద్యుల నిర్లక్ష్యంతో వికలాంగుడిగా మారిన ఏడు నెలల పసికందు.



ఖమ్మం జిల్లా, మే 31,నేషనల్ న్యూస్ రిపోర్టర్.ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామంలో ఏడు నెలల గర్భిణీగా ఉన్నప్పుడే కవల పిల్లలకు జన్మనిచ్చిన తలపాటి సూర్యకాంత్ అనే వ్యక్తి భార్య రేణుక కవల పిల్లల్లో ఓ బాలుడి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో, చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పిన కుటుంబ సభ్యులు రక్తం తక్కువగా ఉందని రక్తం ఎక్కించే క్రమంలో, కాన్యులా ఏర్పరచిన స్థలంలో వాపు వచ్చిందని కుటుంబ సభ్యులు చెప్పినా పెద్ద సమస్య కాదని దాటివేసిన డాక్టర్లు,ఎన్ని రోజులైన వాపు తగ్గకపోవడం, చేయి నల్లగా మారడంతో మరో సారి నిలదీయగా, వెళ్లి ప్రైవేటులో స్కానింగ్ తీసుకొని రండి అంటూ వైద్యుల నిర్లక్ష్యపు సమాధానం,స్కానింగ్ రిపోర్టులో చేతిలో కణజాలు దెబ్బతిని, చేయి పూర్తిగా దెబ్బ తిన్నదని రావడంతో డాక్టర్లను నిలదీసిన బాలుడి తల్లిదండ్రులు హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి వెళితే వెంటనే నయం చేస్తారని చెప్పడంతో,నిలోఫర్ ఆసుపత్రికి తరలింపు,అక్కడి వైద్యులు బాలుడి చేయి పూర్తిగా దెబ్బ తిన్నదని, చేతిని తొలగించాలని చెప్పడంతో కుప్పకూలిపోయిన బాలుడి తల్లిదండ్రులు,చేసేదేమీ లేక బాలుడి చేయి తొలగించేందుకు అంగీకరించిన బాలుడి తల్లిదండ్రులు,ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలుడు వికలాంగుడిగా మారాడని ఆవేదన వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు

## కోర్టు వివాదంలో ఉన్న భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని తాహసిల్దార్ పై కలెక్టర్ కు ఫిర్యాదు.





మహబూబాబాద్ జిల్లా, మే 31, నేషనల్ న్యూస్ రిపోర్టర్.మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఉరుగొండ ఉషారాణి తమ ఉమ్మడి కుటుంబానికి చెందిన కోర్టు విచారణ లో ఉన్న 8-31 గుంటల భూమిని నిబంధనలకు విరుద్ధంగా అమెరికాలో ఉన్న తమ సోదరుడు ఉరుగొండ జనార్ధన్ పేరు మీదకు బదలాయింపుకు మూడు లక్షల యాభై వెయ్యిల రూపాయలు తీసుకుని చిన్న గూడూరు తాహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేసినట్లు అతనిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేశానని బాధితులు తెలిపారు,తమ పూర్వికుల 8 -31 గుంటల భూమి పంపకాల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదం కొనసాగుతుందనీ, కోర్టు విచారణలో ఉందని భూమి నీ ఎవరి పేరున రిజిస్ట్రేషన్ చేయవద్దని తాహసిల్దార్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశానని, తమ ఫిర్యాదు ను పట్టించుకోకుండా డబ్బు ఆశతో అధికార దుర్వినియోగానికి పాల్పడిన తాహసిల్దార్ పై చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరానని బాధితులు తెలిపారు.

## ఘనంగా అంబేద్కర్ నామ స్మరణ కార్యక్రమం...

### సమానత్వ సమాజ నిర్మాణానికి అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శకం...

### 14వ వార్డు కౌన్సిలర్ బొల్లారపు స్వప్న గిరిధర్..



జగిత్యాల జిల్లా,మే31, నేషనల్ న్యూస్ రిపోర్టర్:జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, డిక్కీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అంబేద్కర్ నామ స్మరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జగిత్యాల మున్సిపల్ 14వ వార్డు కౌన్సిలర్ బొల్లారపు స్వప్న గిరిధర్ పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈసందర్భంగా బొల్లారపు స్వప్న గిరిధర్ మాట్లాడుతూ దేశంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడారని తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించేందుకు ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు.ఉద్యోగుల హక్కులు, మహిళల సంక్షేమం, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అనేక అంశాలను రాజ్యాంగంలో పొందుపరచడంలో అంబేద్కర్ పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు.సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందాలని, బహుజనులు పరస్పర విభేదాలకు దూరంగా ఉంటూ సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత అంబేద్కర్ ఆలోచనలను అధ్యయనం చేసి సమాజాభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.అలాగే డిక్కీ జిల్లా కో-ఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు ప్రతి ఆదివారం ఈ స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అంబేద్కర్ ఆశయాల సాధనకు విద్య, చైతన్యం, సామాజిక ఐక్యత అవసరమని, యువత ఆయన బాటలో నడిచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మట్టిపూలు పత్రిక సంపాదకులు తక్కళ్ళ దేవయ్య, మాల మహానాడు అఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు చిత్తారి ప్రభాకర్, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ గొడిసెల అశోక్ రాజు,రుద్ర మనోహర్, జిల్లా దళిత క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షులు ముద్దమల్ల ఆనంద్ ప్రవీణ్ కుమార్, పట్టణ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కంటె అంజయ్య,సిరికొండ మాజీ సర్పంచ్ దాసరి లచ్చయ్య, బొల్లం ప్రభాకర్, సంకె మహేష్, కొల్లూరి సురేందర్, జిల్లా దళిత సంఘాల సీనియర్ నాయకులు దుమాల గంగాధర్,కారంగుల అభిషేక్, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు బొల్లారపు దివాకర్, దూలూరి సాయి న్యాయవాది, తదితర అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

## బాప్టిస్ట్ చర్చలో నూతన ఆడియో సిస్టమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ.



వరంగల్ జిల్లా, మే 31, నేషనల్ న్యూస్ రిపోర్టర్. ఈరోజు వరంగల్ జిల్లా క్రిస్టియన్ కాలనీలోని చంటినరీ ఆర్టిస్ట్ చర్చల్లో నూతన ఆడియో సిస్టం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండ సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, తన భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు గారితో కలిసి మంత్రి సురేఖ



గారు నూతన ఆడియో సిస్టమ్ ప్రారంభించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి గారికి క్రిస్టియన్ మత పెద్దలు, అభిమానులు సాదర స్వాగతం పలికారు కొండా మురళీధర్ రావు, సురేఖ దంపతులను ఈ సందర్భంగా క్రిస్టియన్ మతపెద్దలు సన్మానించారు,ఈ సందర్భంగా మంత్రి సురేఖ గారు మాట్లాడుతూ, చర్చ్ని అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు, ఏసుప్రభువు కృపతో చర్చ్ అభివృద్ధిలో పాలుపంచుకునే భాగ్యం తనకు దక్కిందని మంత్రి సురేఖ అన్నారు. సన్మార్గంలో పయనించి జీవితానికి సరైన అర్థాన్ని ఆపాదించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు, క్రిస్టియన్ మైనారిటీల సర్వతో ముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి తెలిపారు, గతంలో ఎన్నడూ లేని విధంగా చర్చిల నిర్మాణానికి మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు,క్రైస్తవుల సంక్షేమం కోసం తన వంతు పూర్తి సహకారం ఉంటుందని ఏ ఆపద వచ్చిన అండగా ఉంటామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ గారు తెలిపారు.

## జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.



తెలంగాణ,మే 31, నేషనల్ న్యూస్ రిపోర్టర్. జూన్ రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఉదయం వేళలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది, మండుటెండల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ఆవిర్భావ వేడుకలను ఆ రోజు ఉదయం నిర్వహించాలని నిర్ణయించారు,సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే వేడుకలను ఆరోజు ఉదయం 8.30 గంటలకే ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఆరోజు జాతీయ పతాకావిష్కరణతో పాటు అవతరణ ఉత్సవ కార్యక్రమాలను గంటన్నర వ్యవధిలో పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. వేడుకలకు హాజరయ్యే అతిథులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ బీఎల్ఏ-2 సమావేశం, ఓటు హక్కును పరిరక్షించు కోవడానికి బీఎల్ఏలు పోరాటం,పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ.





ఆదిలాబాద్ జిల్లా, మే 31, నేషనల్ న్యూస్ రిపోర్టర్.ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గారికి ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా జిల్లా కేంద్రానికి చేరుకున్న ఎంపీ వంశీకృష్ణ పార్టీ శ్రేణులతో ఆత్మీయంగా కలుసుకుని బీఎల్ఏ-2 సమావేశంలో పాల్గొన్నారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ గడ్డం వంశీకృష్ణ, దేశంలో ఎన్నికల వ్యవస్థను బలహీనపరిచేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను భారీగా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి చర్యలతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు,రాహుల్ గాంధీ దేశంలో ఓటు చోరీపై ముందుగానే హెచ్చరించారని, ఇప్పుడు అదే పరిస్థితులు కళ్లముందు కనిపిస్తున్నాయని అన్నారు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును దూరం చేసే కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు, ఓటు హక్కును పరిరక్షించు కోవడంలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలని సూచించారు, దేశంలో నీట్ పరీక్షల నిర్వహణపై కూడా ఎంపీ వంశీకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు, వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రం స్పందించక పోవడం బాధాకరమన్నారు, తెలంగాణ రాజకీయాలపై స్పందిస్తూ బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ప్రజలను తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో యువతను రెచ్చగొట్టి కేసుల్లో ఇరికించే రాజకీయాలు మంచివి కావని అన్నారు, యువత అభివృద్ధి, ఉపాధి, విద్యపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు,బీఎల్ఏ-2 సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఏర్పాటు, ప్రజా సమస్యలపై స్పందన, రాబోయే రాజకీయ కార్యాచరణపైఎట విస్తృతంగా చర్చించారు, సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి....



జగిత్యాల జిల్లా,మే31, నేషనల్ న్యూస్ రిపోర్టర్;జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఐలవేణి పోచయ్య (55) అనే వ్యక్తి కూలీ పని చేస్తూ జీవిస్తూ ఉంటాడు. అయితే రోజువారి పనిలో భాగంగా 29వ తేదీ రోజున గడ్డి కట్టలు మోయడానికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి చాలా నీరసంగా ఉందని తెలపడంతో అతనిని వెంటనే ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అతనిని పరీక్ష చేయగా డాక్టర్ వడదెబ్బ తగిలిందని తర్వాత అతను చికిత్స పొందుతూ 31 తేదీ ఆదివారం మరణించాడు. అతని భార్య నరసవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు. మృతునికి భార్య, ఒక కూతురు కలదు. అతని కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని గ్రామస్తులు, తదితరులు సంబంధిత అధికారులను కోరారు.

## వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చవద్దు... ధర్మపురి సిఐ ఎ. రాంనర్సింహారెడ్డి సూచన....






జగిత్యాల జిల్లా,మే31, నేషనల్ న్యూస్ రిపోర్టర్;ధర్మపురి మండలంలోని రైతులు వరి కోత అనంతరం పొలాల్లో మిగిలిన వరి కొయ్యలు మరియు ఇతర పంట అవశేషాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చవద్దని ధర్మపురి సిఐ ఎ. రాం నర్సింహారెడ్డి సూచించారు.పంట అవశేషాలను కాల్చడం వల్ల గాలి కాలుష్యం తీవ్రంగా పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు మరియు శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. అలాగే మంటలు అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాలకు వ్యాపించడం వల్ల ఇతర రైతుల పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.అదేవిధంగా పొలాల సమీపంలో ఉన్న ఇళ్లు, గడ్డి వాములు, విద్యుత్ స్తంభాలు మరియు ఇతర ఆస్తులకు కూడా మంటలు వ్యాపించి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. కొన్నిసార్లు రహదారులపై పొగ వ్యాపించడం వల్ల వాహనదారులకు దృష్టి సమస్యలు ఏర్పడి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు.వరి కోయలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని, దీని ప్రభావం భవిష్యత్ పంటల దిగుబడిపై పడుతుందని వివరించారు. కాబట్టి రైతులు వరి అవశేషాలను సేంద్రియ ఎరువుల తయారీకి, పశువుల మేతకు లేదా ఇతర వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు.ప్రజల ప్రాణాలు, ఆస్తులు మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పంట అవశేషాలను కాల్చకుండా సహకరించాలని కోరారు. నిర్లక్ష్యంగా పంట అవశేషాలను కాల్చి ఇతరులకు నష్టం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

## గుడిమెట్ల - కాలభైరవ ఆలయాల అనుసంధానానికి కృష్ణానదిపై వంతెన

**ప్రజాప్రతినిధులతో ఫోన్‌లో చర్చించిన మాజీ మంత్రి దేవినేని ఉమా**



విజయవాడ, మే 31,(నేషనల్ న్యూస్ రిపోర్టర్)చందర్లపాడు మండలం గుడిమెట్ల వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం గుడిమెట్ల గ్రామంలోని ప్రసిద్ధ ద్వారక శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దేవాలయ చరిత్ర, ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని వివరించారు. అలాగే కృష్ణానది ఆవలి గట్టుపై సుమారు 500 మీటర్ల దూరంలో ఉన్న కాలభైరవ స్వామి ఆలయం గురించి కూడా ఉమాకు వివరించారు. ఈ రెండు చారిత్రాత్మక, పవిత్ర ఆలయాలను అనుసంధానం చేసేలా గుడిమెట్ల వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మించాలని స్థానిక ప్రజలు, భక్తులు కోరారు. ప్రజల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన దేవినేని ఉమా అక్కడి నుంచే పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో ఫోన్‌లో మాట్లాడారు. వంతెన నిర్మాణానికి సంబంధించిన ప్రాంతీయ పరిస్థితులను వివరించడంతో పాటు స్వయంగా ఫోటోలు తీసి వారికి పంపించారు. అలాగే నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) తో కూడా ఈ అంశంపై చర్చించి, సంబంధిత ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో ముందుకు వచ్చి వంతెన నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా దేవినేని



ఉమా మాట్లాడుతూ, గుడిమెట్లలోని ద్వారక శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, కృష్ణానది అవతల ఉన్న కాలభైరవ స్వామి ఆలయాలు ఆధ్యాత్మికంగా విశిష్టమైన క్షేత్రాలని పేర్కొన్నారు. ఈ రెండు ఆలయాలను వంతెన ద్వారా అనుసంధానం చేయడం వల్ల భక్తులకు సౌకర్యం కలగడంతో పాటు రెండు జిల్లాల మధ్య రవాణా సదుపాయాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. ఆలయ పరిసరాల్లో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా రాబోయే పుష్కరాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించే దిశగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గుడిమెట్ల ప్రాంత అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లి సానుకూల నిర్ణయం వచ్చేలా కృషి చేస్తామని దేవినేని ఉమా తెలిపారు. స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీవాణి హైస్కూల్ విద్యార్థిని ట్రిబుల్ ఐటీ బాసరకు ఎంపిక



ఆత్మకూరు మండల ప్రతినిధి/ మే 31(నేషనల్ న్యూస్ రిపోర్టర్)వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని శ్రీవాణి హైస్కూల్ పాఠశాల నుండి సీ.దీప్తి ఎస్ ఎస్ సి 2026 పరీక్షా ఫలితాలలో 579 మార్కులతో విజయ దుందుభి మోగించిన విద్యార్థిని సి.దీప్తి 2026(ఐఐఐటి)విడుదల చేసిన ఫలితాలలో (ఐఐఐటీ)బాసరకు సెలెక్ట్ అయింది. పాఠశాల తరఫునుండి విద్యార్థినికి హృదయపూర్వక అభినందనలు తెలియచేసిన పాఠశాల అడ్వైజర్ టి.జే.విశ్వేశ్వర్, ప్రిన్సిపాల్ లతా మరియు గంగాధర్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలియజేశారు. ఈ సంవత్సరం విద్యార్థి సి.దీప్తి సెలెక్ట్ అయినందుకు పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణం, మిగతా విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

## రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి

దేవినేని ఉమా



విజయవాడ, మే 31,(నేషనల్ న్యూస్ రిపోర్టర్)చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామంలో ఇటీవల పునర్నిర్మాణం చేసిన పలు గ్రామదేవతల ఆలయాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆదివారం సందర్శించారు. ఆలయాల్లో కొలువుదీరిన దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. గ్రామంలో పునఃనిర్మించిన పాతపాటి అంకమ్మ తల్లి, నీలగిరి అంకమ్మ తల్లి, కాటమరాజు స్వామి, గంగమ్మ తల్లి దేవాలయాలను సందర్శించిన దేవినేని ఉమా, ఆలయాల అభివృద్ధికి కృషి చేసిన గ్రామస్తులు, దాతలను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సంప్రదాయాలు, గ్రామదేవతల ఆరాధన ప్రజల విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.అనంతరం గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల



మధ్య ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు.ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతు సంక్షేమం, సాగునీటి రంగాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.అలాగే స్వర్గీయ దేవినేని రమణ కృషితో ప్రారంభమైన ప్రతిష్టాత్మక వేదాద్రి ఎత్తిపోతల పథకం రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ పథకానికి సంబంధించిన మరమ్మతు పనులు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నేతృత్వంలో ప్రారంభమయ్యాయని తెలిపారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటూ, వ్యవసాయ రంగానికి పూర్తి స్థాయిలో అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.గ్రామాల్లోని పురాతన దేవాలయాల పునరుద్ధరణతో పాటు వాటి వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.గ్రామస్థులు ఆలయాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రమాణ పూర్తిగా ఇకపై వివాదాలకు గొడవలకు దూరంగా ఉంటాం....



విజయవాడ, మే 31,(నేషనల్ న్యూస్ రిపోర్టర్)నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో చెడు నడత కలిగి, వివిధ కేసులలో ఎదుటివారిపై ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్న వారందరికీ ఈరోజు పోలీసు వారు కౌన్సిలింగ్ చేయడం జరిగింది. ఈ



క్రమంలో వారందరూ కూడా ఇకపై ఎటువంటి వివాదాలకు పోకుండా మంచిగా ఉంటామని ప్రమాణం చేసినారు. ఈ సందర్భంగా నందిగామ పోలీసు వారు మాట్లాడుతూ నందిగామ టౌన్ మరియు మండల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేదని అటువంటి చర్యలు చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా నందిగామ టౌన్ సిఐ పి శ్రీను, డబ్ల్యూ ఎస్ ఐ మహిత, ఇతర సిబ్బంది కౌన్సెలింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.'

# మేధాక్షేత్రంలో అక్షరబీజాలు చల్లిన గురువు అలి మాస్టారూ

మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట:మే-31.(నేషనల్ న్యూస్):-తరగతి గదినే తన ప్రపంచంగా భావించి..ముప్పై ఐదేళ్ల పాటు విద్యార్థుల భవిష్యత్తును అక్షరజ్ఞానంతో తీర్చిదిద్దిన ఉత్తమ ఉపాధ్యాయుడు షేక్ మొహమ్మద్ అలి ఆదివారం పదవీ విరమణ చేశారు. ఎస్జీటీగా ప్రయాణం ప్రారంభించి, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) వరకు సాగిన ఆయన విద్యా ప్రస్థానం అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా పట్టణంలోని బీఆర్ఐజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో సహోపాధ్యాయులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సభ భావోద్వేగభరితంగా సాగింది..సమకాలీనుల జ్ఞాపకాలు -- గురువు స్థానమే శాశ్వతంఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ మాజీ చైర్మన్ రఫాని తన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 90వ దశకంలో తామిద్దరం బీఈడీ పూర్తి చేసి ఒకేసారి ఉద్యోగాలకు ఎంపికయ్యామని, అలి అక్షరాలనే నమ్ముకుని ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లగా, తాను వ్యాపార, రాజకీయ రంగాల వైపు అడుగులు వేశానని చెప్పారు. చివరకు ఇద్దరం గ్రీన్‌ఇంక్ హోల్డర్స్‌గా విరమణ దశకు రావడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ఏ పదవి ఇచ్చే గౌరవమైనా తాత్కాలికమేనని, కానీ తరాల భవిష్యత్తును మార్చే గురువుస్థానం మాత్రమే చిరస్థాయిగా నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. నిరంతరం చిరునవ్వుతో, నిగర్విగా ఉంటూ విద్యార్థుల మనసు గెలుచుకున్న అరుదైన ఉపాధ్యాయుడు అలి అని కొనియాడారు.

### ఘన సత్కారం -- భావోద్వేగ వీడ్కోలు

సభలో ప్రసంగించిన మాజీ కమీషనర్ పెంచలయ్య, మాజీ కౌన్సిలర్లు ఆర్ హరిత, సయ్యద్ బషీర్, సాయిబాబా, ఎన్ హనుమంతరావు, షేక్ కుమీర్, కాలేషావలి, అలాగే రిటైర్డ్ పీఆర్‌టీయూ నాయకులు సీవీఎస్ మణి, యూటీఎఫ్ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ హెచ్ఎంలు ఎ బ్రహ్మస్వాములు, కె సింగయ్య, జి సాంబశివరావు అలి అందించిన విద్యాసేవలను, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రస్తావించారు. అనంతరం ఉపాధ్యాయులు, ఆహూతులు అలిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. పాఠశాల హెచ్ఎం జి నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో హైస్కూల్ టీచర్లు పి శోభారాణి, గంగాధర్, పోపూరి లక్ష్మి, శామ్యూల్, నాగరాజు, ఏవీఎస్ నాయుడు, రమణారావు, ఖాజావలి, వెంకటేశ్వరరావు, చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయు లు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# శేరిలింగంపల్లి జోన్ అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

-నిర్దేశిత గడువులో నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు

-జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ ఆదేశం




శేరిలింగంపల్లి, మే 31 శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ జోన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, బీటీ రోడ్ల పునరుద్ధరణ, వర్షపు నీటి కాలువల ప్రాజెక్టులు, పార్కుల సుందరీకరణ, కమ్యూనిటీ హాళ్లు, పబ్లిక్ టాయిలెట్లు, స్ట్రీట్ లైట్లు తదితర పౌర మౌలిక సదుపాయాల పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా నారాయన్ అమిత్ మాట్లాడుతూ..అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతం చేయడంతో పాటు, ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటించాలని సూచించారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ మండలానికి మూడు ప్రీ ప్రైమరీ స్కూళ్లు

ఎం ఈ ఓ నిజాముద్దీన్



నారాయణపేట మే 31:తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే లక్ష్యంతో తీసుకువచ్చిన ప్రీ ప్రైమరీ పాఠశాలలను కృష్ణ మండ లంలో మూడు పాఠ శాలలను మంజూరు చేసిందని మండల విద్యాధి కారి నిజాముద్దీన్ తెలిపారు. మండలంలోని ముడుమా ల,హిందూపూర్,కున్సీ గ్రామాలకు మంజూరైనట్లు పేర్కొన్నారు.జూన్ 12 నుండి 3 సంవత్సరాల నుం డి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అడ్మిషన్లు కల్పించి ఆట పాటలతో ఆహ్లాదకరమైన వాతావర ణంలో విద్యాబోధన చేయి స్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రదానోపా ధ్యాయులు ప్రభుత్వ ఆదేశా నుసారం తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రీ ప్రైమరీ తరగతులను సద్వి నియోగం చేసుకోని తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల ను నెరవేర్చుటకు ప్రతి ఒక్క రు కృషి చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

# మన్ కీ బాత్ వీక్షించిన బిజెపి నాయకులు



నారాయణపేట మే 31:ప్రతి నెల చివరి ఆదివారం భారత ప్రజలకు టెలికాస్ట్ ద్వారా తన మనసులోని మాటను తెలుపుతూ దేశం లోని, ప్రపంచంలోని సమకా లంలో జరుగుతున్న అన్ని సమస్యలను తట్టి లేపుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆది వారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నారా యణపేట జిల్లా కేంద్రంలో బిజెపి నాయకులు శ్రద్ధగా వీక్షించారు.ఈకార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందునామాజీ ,కౌన్సిలర్ ప్రభాకర్,కే.శ్రీనివాస్,ఉమాకాంత్,తాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

# మాగనూరు నుంచి మరో ముగ్గురు అగ్నివీర్ లు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ హర్షం





నారాయణపేట మే 31: దేశ సేవలో పాల్గొనేందుకు మరో ముగ్గురు యువకులు మాగ నూరు మండల కేంద్రానికి చెందిన ముదురు యువకులు అగ్నివీర్ లుగా ఎంపికయ్యారు.దాంతో సర్వత్ర వర్షంవ్యక్తం చేస్తు న్నారు. గ్రామ ప్రజలుఅగ్నివీర్ లుగా కేంద్రానికి చెందిన రాకేష్ ,బాలకృష్ణ, గోపాల్ అనే యువకులు ఎంపిక అయ్యారు. ఇప్పటికే గ్రామం నుంచి కొందరు యువకులు సైనికులుగా దేశ సేవలో ఉండగా ఇప్పుడు మరో ముగ్గురు యువకులు దేశానికి సేవ చేసేందుకు ఎంపిక రావడం చాలా ఆనం ద కరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, గ్రామ సర్పంచ్ దండు జనార్ధమ్మ హర్షం వ్యక్తం చేశారు. దేశానికి సేవలు చేస్తూ అటు దేశానికి ఇటు గ్రామానికి మంచి పేరు సంపా దించి పెట్టాలని ఈ సందర్భం గా వారు ఆకాంక్షించారు. ఈ ముగ్గురు యువకులను చూసి గ్రామంలోని యువకు లు కూడా దేశ సేవ కోసం కష్టపడి సాధించాలని కోరా రు.తల్లిదండ్రులు వ్యవసా య పనులు చేస్తూ కుమారు లను చదివిపించారు. తల్లి దండ్రుల కష్టాన్ని చూస్తూ పెరి గిన రాకేష్, బాలక్రిష్ణ, గోపాల్ భారతదేశ సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో రాకేష్ బాలకృష్ణ గోపాల్ గత రెండేళ్లుగా మాగ నూర్ లో ఉంటూ శిక్షణ పొందుతున్నారు.ఇటీవలే ప్రకటించిన అగ్నివీర్ జనరల్ డ్యూటీ కేటగిరి ఫలితాల్లో ప్రతిభకనబరిచి వారి స్వప్నా న్ని సాకారం చేసుకున్నారు. అగ్నివీర్ కు ఎంపికైన యువ కులు ను గ్రామ యువకులు , పెద్దలు అభినందనలు తెలిపారు.

# అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

తాసిల్దార్ అబ్దుల్ రహమాన్



నారాయణపేట మే 31: మాగనూరు మండల పరిధి లో ఎలాంటి అను మతులు లేకుండా అక్రమ ఇసుక, మట్టి( మొరం), వండ్రు మట్టి దందాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తాసిల్దార్ అబ్దుల్ రెహమాన్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించా రు. సెలవు దినాల్లో కానీ రాత్రి వేళలో కానీ అదేవిధం గా అనుమతులు లేకుండా మండలంలో అక్రమ వ్యాపా రం చేస్తున్న వారు వారి పద్ధతి మార్చుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరి కి కూడా అవసరమైన మేరా ఇసుక, మట్టి , ఒండ్రు మట్టి కి ప్రభుత్వపరంగా అనుమతు లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన లబ్ధిదారులు ట్రాక్టర్ ,టిప్పర్ల యజమానులు అనుమ తులు పొందాలని తెలిపారు. ప్రభుత్వ ఆదాయాన్నికి గండి పడే విధంగా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్చరికలు బెకతార్ చేస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక అను మతులు పొందుతున్న ట్రాక్ట ర్ యజమానులు నిజమైన లబ్ధిదారులకు ఇసుక సరఫ రా చేయకుండా ఎక్కువ డబ్బులకు బయట వారికి అమ్ముకుంటున్నట్టు సమా చారం వచ్చిందని తెలిపారు. లబ్ధిదారుల కాకుండా ఇసుక పక్క దారి పట్టిస్తున్న ట్రాక్టర్ ను సీజ్ చేసి కేసు నమోదు చేయడంతో పాటు మరోసారి అట్టి ట్రాక్టర్కు ఇందిరమ్మ ఇంటికి ఇసుక అనుమతులు ఇవ్వబడవని తెలిపారు . ముఖ్యంగా స్థానిక ఎస్ఐ పోలీస్ సిబ్బంది అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న వారిని గుర్తించి అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

# భజరంగ్ దల్ అధ్యక్షుడిని సన్మానించిన నామాజీ



నారాయణపేట మే 31: నారాయణపేట జిల్లా భజరంగ్ దల్ అధ్యక్షుడు శ్రావణ్ తన జన్మదిన సందర్భంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా శ్రావణ్ ను నాగురావు నామాజీ శాలువాతో సన్మానించి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ పాల్గొన్నారు.

# శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నూతన ఆలయ కమిటీ భవనం ప్రారంభించిన..ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి

-దేవాలయ అభివృద్ధికి అందరి సహకారం అభినందనీయం

-భక్తుల సేవలకు మరింత ఉపయోగపడనున్న నూతన భవనం

-భవన నిర్మాణ దాత చిన్నమైల్ శంకర్ రెడ్డి



పఠాన్ చేరు, మే 31 (రామచంద్ర పురంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ఆలయ కమిటీ భవనాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల మధ్య, భక్తుల హర్షధ్వానాల నడుమ జరిగిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి ద్వారా సమాజంలో సనాతన ధర్మ పరిరక్షణతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించవచ్చని పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన ఆలయ కమిటీ భవనం ద్వారా దేవస్థానం పరిపాలనా కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా నిర్వహించ బడటంతో పాటు, భక్తులకు అవసరమైన సేవలను అందించేందుకు అనుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం సేవలందించిన దాతలు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తుల కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఈ భవనం ఆలయ కమిటీ చేపట్టే సేవా కార్యక్రమాలకు మరింత దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, భవన నిర్మాణ దాత చిన్నమైల్ శంకర్ రెడ్డి, కురుమ సంఘం అధ్యక్షులు నర్సింలు, ఆలయ కమిటీ అధ్యక్షులు యాదగిరి, ఇతర ముఖ్య నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వడ్లు రోడ్లపై..అప్పులు రైతు నెత్తిపై

## -మబ్బులు చల్లదనం తెచ్చినా రైతుల గుండెలలో మాత్రం ఆందోళన

-దేశ అభివృద్ధికి పునాది రైతే..అన్నదాతకు అండగా నిలవాల్సిన సమయం ఇదే



హైదరాబాద్, మే 31 దేశంలో ఎన్ని పరిశ్రమలు వచ్చినా, ఎన్ని కంపెనీలు స్థాపించినా, సాంకేతిక రంగం ఎంత అభివృద్ధి చెందినా చివరకు ప్రతి మనిషి ఆకలిని తీర్చేది రైతు పండించిన గింజలే. అందుకే "రైతు లేని రాజ్యం లేదు" అనే మాట అతిశయోక్తి కాదు, అక్షర సత్యం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా రోడ్లపై, కల్లాల వద్ద నిల్వ ఉంచారు. ఇదే సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొన్ని రోజులుగా 45 డిగ్రీల వరకు నమోదైన తీవ్ర ఉష్ణోగ్రతల తర్వాత ఆకాశమంతా మబ్బులు కమ్ముకుని ఈదురు గాలులు వీయడం ప్రారంభమైంది. ప్రజలకు ఇది ఉపశమనం కలిగించినప్పటికీ రైతులకు మాత్రం కొత్త ఆందోళనకు కారణమైంది. ఎండలో చెమటోడ్చి పండించిన ధాన్యం వర్షానికి తడిస్తే నాణ్యత దెబ్బతింటుందని రైతులు భయపడుతున్నారు. రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన వడ్లు ఎప్పుడు వర్షం కురుస్తుందోననే భయంతో రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఒకవైపు ప్రకృతి అనిశ్చితి, మరోవైపు బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, పెరిగిన సాగు ఖర్చులు రైతులను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. రైతు పండించిన ప్రతి గింజ వెనుక అతని కష్టం, కుటుంబ త్యాగం, ప్రకృతితో పోరాటం దాగి ఉంటుంది. విత్తనం నుంచి పంట చేతికొచ్చే వరకు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ దేశానికి అన్నం పెడుతున్న రైతు పరిస్థితి నేటికీ ఆందోళన కరంగానే ఉంది. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. వ్యవసాయం బలపడితేనే ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది.ప్రభుత్వాలు రైతులు నిల్వ ఉంచిన ధాన్యాన్ని అత్యవసరంగా కొనుగోలు చేసి, వర్షాల వల్ల నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. అవసరమైన చోట టార్పాలిన్లు, గిడ్డంగులు, రక్షణ ఏర్పాట్లు కల్పించి రైతుకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నాయి. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు గౌరవం, భద్రత, ఆర్థిక స్థిరత్వం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత. జయహో రైతన్న.. జయహో భారతమాత!అన్నదాత సుఖీభవ!

# త్యాగాల పునాదులు మావి.. అబద్ధాల చరిత్ర కాంగ్రెస్‌ది..గూడెం మహిపాల్ రెడ్డి

-ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యం..పఠాన్ చేరు లో 9 డివిజన్ లలో క్లీన్ స్వీప్ చేసాము



పఠాన్ చేరు, మే 31కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, వాటిని అమలు చేయకుండా అబద్ధాల పాలన కొనసాగిస్తోందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలలో పఠాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని 9 డివిజన్ లలో బీఆర్ఎస్ జెండా ఎగరవేసి, రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేపడతామని ప్రకటించారు. ఆదివారం పటాన్చెరు డివిజన్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు పటాన్చెరు ప్రజలు గులాబీ జెండాను ఆదరిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో దశాబ్ద కాలం పాటు అభివృద్ధి, సంక్షేమంలో పటాన్చెరును అగ్రస్థానంలో నిలిపామని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఇండ్ల కూల్చివేతలు, రైతుల రోదనలు, నిరుద్యోగుల ఆక్రందనలు పెరిగాయని విమర్శించారు. హైడ్రా చర్యలతో పేదల జీవనోపాధి దెబ్బతింటోందని, ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పటాన్చెరు పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధి పనులకు కేటాయించాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో స్థానికులకు 10 శాతం కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పటాన్చెరు బీఆర్ఎస్‌కు కంచుకోట అని, ఎమ్మెల్యే జీఎంఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు సాధిస్తామని తెలిపారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఇన్‌చార్జ్ ఈవోగా బి. అశోక్ కుమార్ బాధ్యతల స్వీకరణ



చిలకలూరిపేట:మే-31.(నేషనల్ న్యూస్):-ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బొప్పిడి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన (బొప్పూడి గ్రూప్ టెంపుల్స్) ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి (ఈవో) గా చిలకలూరిపేట గ్రూప్ టెంపుల్స్ ఈవో బి. అశోక్ కుమార్ నేడు బాధ్యతలు స్వీకరించారు.?ఇప్పటివరకు ఇక్కడ ఈవోగా విధులు నిర్వహించిన సత్యనారాయణరెడ్డి పదవీ విరమణ పొందడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు, చిలకలూరిపేట ఈవోగా ఉన్న బి. అశోక్ కుమార్‌కు బొప్పూడి గ్రూపు దేవస్థానముల అదనపు బాధ్యతలను (అడిషనల్ చార్జ్) అప్పగించారు.

# సీఎంను కలిసిన జనసేన నాయకులు సొసైటీ చైర్మన్ బద్రి



విజయవాడ , మే 31,(నేషనల్ న్యూస్ రిపోర్టర్)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని శనివారం సాయంత్రం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా జనసేన పార్టీ నాయకులు, నందిగామ పిఎసిఎస్ సొసైటీ చైర్మన్, కొట్టె హరికృష్ణ (బద్రి) కలిశారు.సీఎం చంద్రబాబు నాయుడు తో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో తనపై నమ్మకంతో సొసైటీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.గత కొన్ని రోజులుగా నందిగామ పట్టణంలో శ్రీ సుఖశాంబలంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి సంబందించిన కోనేరు 1.25 ఎకరాల స్థలం ఆక్రమానికి గురైన సమస్యపై హిందూ సంఘాలు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు గురించి సీఎం కి డాకుమెంట్ రూపంలో అందజేసి వివరిస్తూ, శివాలయం కోనేరు సమస్యను పరిష్కరించాలని కోరడం జరిగింది. దీనికి చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తానని తెలిపారు.కూటమి ప్రభుత్వ పని తీరు, క్షేత్రస్థాయిలో సమన్వయం పైన పలు అంశాలు సీఎం దృష్టికి బద్రి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వ ఇచ్చిన బాధ్యతను మరింత సమర్థవంతంగా ప్రజా సమస్యల పరిష్కారం కొరకు, నందిగామ అభివృద్ధి మరియు కూటమి విజయాల కోసం అంకితభావంతో పనిచేస్తానని నందిగామ పిఎసిఎస్ చైర్మన్ బద్రి హామీ ఇచ్చారు. సీఎం ని కలిసిన సందర్భంలో జనసేన నాయకులు కొమ్మినిడి. సత్యనారాయణ, ప్రసాదపు. కేధర్ నాధ్ ఉన్నారు



# కాకాని కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవినేని ఉమా



విజయవాడ, మే 31:నందిగామలోని ఇషా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఈనాడు పత్రికా విలేకరి కాకాని వెంకటేశ్వరరావు తల్లి శ్రీమతి లక్ష్మీ ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆదివారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న దేవినేని ఉమా లక్ష్మీ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కాకాని వెంకటేశ్వరరావు గారితో మాట్లాడి ధైర్యం చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుంటూరు:మే-31.(నేషనల్ న్యూస్):-చిలకలూరిపేట నుండి గుంటూరు వైపు వెళ్తున్న బొలెరో వాహనం (ఏపీ 21కె 1168),ఓబులనాయుడుపాలెం వద్దకు రాగానే అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న చిలకలూరిపేట సుభాని నగర్ మొదటి లైన్‌కు చెందిన ఎస్కే కరిముల్లా (42) తీవ్ర గాయాలకు గురై, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో వాహనంలోనే ఉన్న కరిముల్లా భార్య తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు..

# నేడు వైఎస్సార్‌సీపీ పాడేరులో యువజన విభాగం భారీ నిరసన ర్యాలీ.




కొయ్యూరు, మే 31 0 (నేషనల్ న్యూస్ )ప్రతినిధి జీ .కామేష్.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, వాటిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ అచ్యుత్ డిమాండ్ చేశారు.మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతకు ఆశలు పెట్టించి, చివరకు వారి భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడిందని ఆయన విమర్శించారు.ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నేడు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీతో పాటు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రధాన డిమాండ్లు

1. పరీక్షలు పూర్తయినప్పటికీ అభ్యర్థుల మార్కులు, మెరిట్ జాబితాలను బహిరంగంగా ప్రకటించకుండా కేవలం ఎంపికైన వారికి మాత్రమే సమాచారం ఇవ్వడంపై పూర్తి విచారణ జరపాలి.2. పరీక్ష రాయకుండానే ఒకరు స్టేట్ ర్యాంకర్‌గా నిలిచినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి.3. క్రీడల కోటాలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి.హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేసి, నష్టపోయిన అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలి.ర్యాలీకి భారీగా తరలిరావాలని పిలుపు.నేటి ఉదయం పాడేరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఈ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు అచ్యుత్ తెలిపారు. కార్యక్రమంలో మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్యలింగంతో పాటు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరై ఈ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్యుత్ పిలుపునిచ్చారు.

## శ్రీ భగలాముఖి ఆలయానికి రూ. 1.50 లక్షల విరాళం

### పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠకు రంగం సిద్ధం



బాపట్ల చందోలు, మే 31 : చందోలులోని శ్రీ భగలాముఖి అమ్మవారి క్షేత్రం ఆధ్యాత్మికంగా మరింత పునీతమవుతోంది. ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని జరిగిన ప్రత్యేక పూజలు, దేవతా విగ్రహాల విరాళం ప్రకటన ఆలయ వైభవాన్ని చాటిచెప్పాయి. భక్తుల విశేష రాకతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. పౌర్ణమి సందర్భంగా శ్రీ భగలాముఖి అమ్మవారిని 'పూర్ణ చంద్రకళాధరి'గా అత్యంత వైభవంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా, సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. భక్తులందరికీ దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు, ఎండల తీవ్రత దృష్ట్యా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయంగా మారింది. ఆలయానికి అత్యంత ముఖ్యమైన పంచలోహ విగ్రహాల కొనుగోలుకు అవసరమైన నిధులను దాతలు అందజేశారు. ఒంగోలుకు చెందిన భక్తులు తెల్లబాటి శ్రీనివాసరావు, కనకదుర్గ దంపతులు తమ కుమారుడు ప్రణీత్ సాయి పేరు మీద రూ. 1,50,000 విరాళాన్ని దేవస్థానానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో జి. నరసింహమూర్తి మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి సబ్సిడీపై శ్రీ భగలాముఖి అమ్మవారు, శ్రీ వారాహి అమ్మవారు, శ్రీ రాజ్య శ్యామల, శ్రీ కాలభైరవ స్వామివార్ల పంచలోహ విగ్రహాలను పొందడానికి అనుమతి లభించింది. విగ్రహాల తయారీకి అవసరమైన రూ. 1.50 లక్షల డిడిని టీటీడీకి చెల్లించాల్సి ఉంది. దాతల సహకారంతో త్వరలోనే విగ్రహాల తయారీని ప్రారంభించి, మూడు నెలల కాలంలో వీటిని ఆలయానికి తీసుకువస్తాము" అని వివరించారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ, "భక్తుల సౌకర్యార్థం, ఆధ్యాత్మికతను పెంపొందించే దిశగా ఆలయ అభివృద్ధిని చేపడుతున్నాము. దాతల సహకారం ఈ ప్రయత్నానికి ఎంతో బలాన్ని ఇస్తోంది. మన ఆలయానికి ప్రతిష్టాత్మకమైన దేవతా విగ్రహాలు రావడం మనందరికీ గర్వకారణం" అని పేర్కొన్నారు. దాతలను వేద పండితులు ఆశీర్వదించి, ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు వక్కలగడ్డ ప్రసాదు, ఎనకపల్లి వెంకటప్పయ్య పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై దాడి

### తీవ్రంగా ఖండించిన హోం మంత్రి వంగలపూడి అనిత



విశాఖపట్నం, మే 31 : విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటరమణపై కత్తితో దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. లంకెలపాలెం వద్ద విధులు నిర్వర్తిస్తున్న సమయంలో దుండగుల దాడికి గురై గాయపడిన హోంగార్డు వెంకటరమణ ప్రస్తుతం షీలా నగర్ కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆసుపత్రికి వెళ్లిన హోం మంత్రి అనిత, వెంకటరమణను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటరమణపై కత్తితో దాడి చేయడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని అన్నారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు అయినప్పటికీ, పోలీసులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని తెలిపారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో వెంకటరమణ చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఘటనకు పాల్పడిన నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తుందని, అవసరమైన పటిష్ట చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పోలీసులు ప్రజల భద్రత కోసం అనునిత్యం కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని, వారి విధుల నిర్వహణకు ప్రజలు కూడా సహకరించాలని హోం మంత్రి విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.

## 43 ఏళ్ల అంకితభావానికి ఘన వీడ్కోలు

### పోలీసు వృత్తిలో మల్లవరపు శ్రీనివాసులు ఒక ఆదర్శం



బాపట్ల జిల్లా మే 31 : సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖకు అంకితభావంతో సేవలు అందించడం



ఎంతో అభినందనీయమని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ కొనియాడారు. ఆదివారం పదవీ విరమణ పొందిన ఎస్ఐ మల్లవరపు శ్రీనివాసులు ని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్పీ పూలమాల వేసి, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. 1983 జూన్ 15వ తేదీన పోలీస్ శాఖలో చేరిన ఆయన కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ఐ వరకు పదోన్నతులు పొందారు. మొత్తం 43 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు విశేష సేవలు అందించారు. తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో కొల్లిపర, అయినవోలు, భట్టిప్రోలు, మాచర్ల రూరల్, నరసరావుపేట, ముప్పాళ్ల, బాపట్ల రూరల్, సూర్యలంక మెరైన్, అమర్తలూరు, వెదురుపల్లి, చీరాల వన్ టౌన్, రేపల్లె టౌన్, కావలి టూ టౌన్, బాపట్ల రూరల్, డీసీఆర్బీ బాపట్లలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. తన సర్వీసులో మొత్తం 30 రివార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, అన్ని ఉద్యోగాల్లోకెల్లా పోలీసు ఉద్యోగం ఎంతో ఒత్తిడితో కూడుకున్నదని, ప్రజలకు నేరుగా సేవలు అందించే భాగ్యం ఈ వృత్తిలోనే కలుగుతుందన్నారు. సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖకు సేవలందించడానికి సహకరించిన వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని, ఏ సమస్య వచ్చినా నేరుగా సంప్రదించవచ్చని ఎస్పీ గారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, సోషల్ మీడియా సీఐ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ షేక్.మౌలుద్దీన్, పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గోదావరి డెల్టాకు 'ఖరీఫ్' జలకళ

ముందస్తుగా సాగునీటి విడుదల

రైతు సంక్షేమమే లక్ష్యం..

రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది: సాగునీటి విడుదలలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు..

ధవళేశ్వరం వద్ద గోదావరి జలాలను కాలువలకు వదిలిన మంత్రులు, ప్రజాప్రతినిధులు.

బ్యారేజీ గేట్ల మరమ్మతులకు రూ. 148 కోట్లు మంజూరు: మంత్రి కందుల దుర్గేష్.

ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు నాట్లకు రైతాంగానికి పిలుపు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మే 31 : స్థానిక సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద ఆదివారం ఖరీఫ్ సీజన్ సాగునీటి విడుదల కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని గోదావరి జలాలను కాలువలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నదని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు నాట్లు ముందుగానే వేసుకొని పంటలను రక్షించుకోవాలని సూచించారు. ముందస్తు నీటి విడుదల వల్ల పంట త్వరగా చేతికొచ్చి రైతులు నష్టాల నుంచి బయటపడతారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గోదావరి డెల్టాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల మరమ్మతులకు నిధులు కేటాయించలేదని మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కాలువల మరమ్మతుల కోసం మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి, 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు నెలల తరబడి చెల్లింపుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం రైతు కేంద్రిత పాలన సాగుతోందన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ రైతు బాగుంటే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందనే సిద్ధాంతంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ముందస్తుగా సాగునీరు అందించడం ప్రభుత్వం రైతుల పట్ల కలిగిన నిబద్ధతకు నిదర్శనమన్నారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ నీటి విడుదల ద్వారా కాకినాడ జిల్లా పరిధిలో 1,37,838 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుందని తెలిపారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గించి రైతులకు మేలు చేకూర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి విడుదలకు వార్షిక ప్రణాళిక రూపొందించిన ముఖ్యమంత్రి నిర్ణయాల ఫలితంగానే నేడు ధవళేశ్వరం నుంచి నీటి విడుదల జరుగుతోందన్నారు. 1847లో గోదావరి ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సర్ ఆర్థర్ కాటన్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాల పరిరక్షణ కోసం పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో రూ.100 కోట్ల నిధుల కేటాయింపుకు హామీ లభించిందన్నారు. గోదావరి కాలుష్య నివారణ, బ్యారేజ్ పరిరక్షణ, సాగునీటి సదుపాయాల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మూరలశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ, ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి ఈస్టర్న్ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగిందని, రైతుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సాగునీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంత పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు పాల్గొనడం పట్ల ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. వెస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురళీకృష్ణరాజు మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే సాగునీటిని విడుదల చేయడం అభినందనీయమన్నారు. గోదావరి డెల్టా పరిధిలోని రైతులు నీటిని పొదుపుగా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. సాగునీటి వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న బ్యారేజ్, కాలువల మరమ్మతు పనులు రైతాంగానికి దీర్ఘకాలికంగా మేలు చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మూరల శెట్టి సునీల్ కుమార్, వెస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురళీ కృష్ణ రాజు, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు చీఫ్ ఇంజనీర్ చినబాబు, ధవళేశ్వరం ఎస్ ఈ జి.



శ్రీనివాస్ రావు, హెడ్ వర్క్స్ ఎస్ ఈ శ్రీనివాస్, ఈ ఈ రామ కృష్ణ, విజ్జేశ్వరం ఈ ఈ రమేష్ బాబు, రైతులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరస్తుల పాలిట 'కార్డన్ అండ్ సెర్చ్' ఉక్కుపాదం

జిల్లాలో భారీ తనిఖీలు

జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ వ్యూహాత్మక ఆదేశాలు.

186 మంది పోలీసులతో ఏకకాలంలో దాడులు.

మత్తు పదార్థాలు, నాటుసారా తయారీపై పోలీసుల 'సర్జికల్ స్ట్రైక్': భారీగా వాహనాల స్వాధీనం.

ప్రజల భద్రత కోసం గస్తీ పటిష్టం:

అనుమానితులపై నిరంతర నిఘా.





బాపట్ల జిల్లా మే 31 జిల్లాలో అసాంఘిక శక్తులు, నేర ప్రవృత్తి గల వ్యక్తులపై ఉక్కుపాదం మోపే లక్ష్యంతో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఆదివారం 'కార్డన్ అండ్ సెర్చ్' పేరుతో మెరుపు దాడులు నిర్వహించింది. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ నేరుగా క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బందిని సమన్వయం చేస్తూ, జిల్లాలో ఎక్కడా అక్రమ కార్యకలాపాలకు చోటు లేదని సందేశాన్ని బలంగా పంపారు. కేవలం వాహనాల తనిఖీకే పరిమితం కాకుండా, నేరాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను, గతంలో నేర చరిత్ర ఉన్న వ్యక్తుల నివాసాలను లక్ష్యంగా చేసుకుని పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. రేపల్లె, బాపట్ల, చీరాల సబ్ డివిజన్లలోని చుందూరు, మార్టూరు, చీరాల ×× టౌన్ పరిధిలో జరిగిన ఈ తనిఖీల్లో పోలీసుల పనితీరు ప్రశంసనీయం. ఆపరేషన్‌లో భాగంగా రహదారులపై ప్రయాణించే వాహనదారులు, సరైన ధ్రువపత్రాలు లేని వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నేరపూరిత ధోరణి ఉన్న వ్యక్తుల వివరాలను రికార్డు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో, బాపట్ల జిల్లా పోలీసులు కూడా అదే బాటలో అడుగులు వేస్తున్నారు. యువత గంజాయికి బానిసై తమ జీవితాలను అంధకారం చేసుకోవద్దు. మత్తు పదార్థాల రవాణా లేదా విక్రయాలు జరిపేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి కూడా వెనుకాడబోం" అని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారీని పూర్తిగా నిర్మూలించే వరకు ఈ దాడులు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ ఆపరేషన్ కేవలం నేరస్తులను పట్టుకోవడమే కాకుండా, ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంచే విధంగా సాగింది. డిఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో పాటు 186 మంది సిబ్బంది కలిసి చేసిన ఈ ఆపరేషన్, అసాంఘిక శక్తులకు ఒక హెచ్చరికగా నిలిచింది. అనుమానాస్పదంగా నివసిస్తున్న వారి వివరాలను ప్రజలే నేరుగా 112 ద్వారా లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి చెబితే, వారి గోప్యతను కాపాడుతూ తక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జిల్లావ్యాప్తంగా మారుమూల గ్రామాల నుంచి పట్టణ కేంద్రాల వరకు ఈ తరహా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు మరింత ఉధృతం చేయనున్నట్లు జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాపట్ల జిల్లాను 'క్రైమ్ ఫ్రీ' (నేర రహిత) జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది.

# బాపట్ల ఏబీఎఫ్ఎంఎస్ ఆస్తుల చిచ్చు



బాపట్ల, మే 31 అఖండ సూర్య బాపట్ల పట్టణంలో ఉన్న ఏబీఎఫ్ఎంఎస్ (అమెరికన్ బాప్టిస్ట్ ఫారెన్ మిషన్ సొసైటీ) సంస్థ ఆస్తుల విషయంలో కొందరు వ్యక్తులు చేస్తున్న అక్రమ చర్యలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు బాపట్ల క్రైస్తవ సమాజంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. సంస్థకు ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు, 'ఆస్తుల పరిరక్షకుల'మని చెప్పుకుంటూ చేస్తున్న అవాస్తవ ప్రచారాల పట్ల సంస్థ ఫీల్డ్ కస్టోడియన్ నేడు మీడియా ముఖంగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సంస్థ యొక్క చట్టబద్ధమైన పత్రాలు, బాధ్యులు ఉండగా, ఏమాత్రం సంబంధం లేని కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో అవాకులు చవాకులు పేలుతున్నారని, హైకోర్టు నుండి జిల్లా కలెక్టర్ వరకు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అర్థం పర్థం లేని ఫిర్యాదులు ఇస్తున్నారని ఆయన వెల్లడించారు. "సంస్థ ఆస్తులను కాపాడతామని చెప్పి, స్వప్రయోజనాల కోసం బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారు. ఇది మా సంస్థకు తీరని అవమానం" అని ఆయన పేర్కొన్నారు. సంస్థ పేరును వాడుకుంటూ, కొన్ని వర్గాలను, పోలీసు ఉన్నతాధికారులను సైతం వశపరుచుకునేందుకు ఈ ముఠా చేస్తున్న ప్రయత్నాలు స్థానిక ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇటువంటి వ్యక్తుల చేతుల్లోకి సంస్థ ఆస్తులు వెళితే, భవిష్యత్తులో క్రైస్తవ ఆస్తులే కాకుండా క్రైస్తవ మత ఉనికి కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను గమనిస్తున్నాం. ఇటువంటి దొంగలను మనం ఉపేక్షిస్తే మన ఉనికి ప్రశ్నార్థకం అవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన సంస్థ ఆస్తుల కోసం తాము ఉన్నత న్యాయస్థానంలో చట్టపరంగా పోరాడుతున్నామని, తమ పోరాటం తుది శ్వాస వరకు ఆగదని ఆయన గంభీరంగా ప్రకటించారు. ఇందులో భాగంగా, సంస్థకు సంబంధించిన పూర్తి వివరాలు, చట్టబద్ధమైన పత్రాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను సోమవారం జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇటువంటి అబద్ధపు వార్తలను ప్రజలు నమ్మవద్దని, ఇటువంటి వ్యక్తులను చూసిన వెంటనే స్పందించి తిప్పికొట్టాలని క్రైస్తవ సమాజానికి ఆయన పిలుపునిచ్చారు. అనధికారిక సంస్థలను సృష్టించి, ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్న వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, అనవసరమైన ఫిర్యాదులను తిరస్కరించాలని కోరారు.

# సహకార వ్యవస్థకు 'దిక్సూచి'గా విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్



బాపట్ల, మే 31 :సహకార రంగంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఒక శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంది. బాపట్ల పట్టణంలోని కిరాణా మర్చంట్స్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన బాపట్ల బ్రాంచి సభ్యుల మహాసభ, బ్యాంక్ సాధిస్తున్న అద్భుత ప్రగతికి నిదర్శనంగా నిలిచింది. జోనల్ మేనేజర్ ఎం. ఎర్రయ్య రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం, బ్యాంక్ భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశం చేసింది. గడిచిన 111 ఏళ్ల కాలంలో, ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా పేద, మధ్య తరగతి వర్గాలకు నమ్మకమైన ఆర్థిక తోడ్పాటును అందించడంలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ అగ్రస్థానంలో ఉంది. బ్యాంక్ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.వి. మల్లికార్జునరావు మాట్లాడుతూ, మేము కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా, సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. సహకార వ్యవస్థ బలోపేతం అయితేనే ఆర్థిక అసమానతలు తొలగుతాయి" అని పేర్కొన్నారు. బ్యాంక్ అనుసరిస్తున్న పారదర్శకమైన విధానాలే నేడు వేలాది మందిని ఆకర్షిస్తున్నాయని ఆయన తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ ఏ. అర్జున్ రావు అందించిన నివేదిక ప్రకారం, బాపట్ల బ్రాంచ్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో 106 మంది ఉన్న సభ్యుల సంఖ్య, ప్రస్తుతం 267కు పెరగడం బ్యాంక్ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకానికి అద్దం పడుతోంది. ఎగవేతదారులు లేని బ్రాంచిగా నిలవడం వెనుక, ఖాతాదారులకు అందిస్తున్న సులభతర రుణ ప్రక్రియ, పారదర్శకమైన వడ్డీ రేట్లు ప్రధాన కారణమని ఆయన విశ్లేషించారు. మార్పును ఆహ్వానించడం మా ప్రత్యేకత" అని డైరెక్టర్ కే. శ్రీకాంత్ బాబు పేర్కొన్నారు. డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ లావాదేవీలు ఆర్బీఐ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో సభ్యుల కోసం మరిన్ని డిజిటల్ బ్యాంకింగ్ ఫీచర్లను తీసుకురాబోతున్నట్లు ఆయన ప్రకటించారు. కొత్తగా ఎంపికైన 'సంప్రదింపుల కమిటీ' సభ్యులు షేక్ మౌలాలి, గురజాల శ్రీనివాసరావు, గొట్టిముక్కల బాలాజీలు మాట్లాడుతూ, సభ్యుల సమస్యల పరిష్కారానికి తాము వారధులుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు బ్యాంక్ సభ్యుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయి. కళాకారుల సత్కారం, సభ్యులకు దుప్పట్ల పంపిణీతో మహాసభ పండుగ వాతావరణంలో ముగిసింది.

## ఆకాశంలో అద్భుతం.. దశాబ్దాల తర్వాత 'మైక్రో బ్లూ మూన్'



వాషింగ్టన్ : ఆకాశంలో అరుదైన, అత్యంత ఆకర్షణీయమైన ఖగోళ వింత ఆవిష్కృతం కానుంది. ఒకే రోజున అటు 'బ్లూ మూన్'గా, ఇటు 'మైక్రో మూన్'గా చంద్రుడు కనిపించనున్నాడు. ఈ రెండు విభిన్న ఖగోళ విశేషాలు ఒకేసారి కలిసి రావడం దశాబ్దాలకు ఒకసారి మాత్రమే జరిగే అరుదైన విషయమని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా'-(ఎన్ఎఎస్ఎ) వెల్లడించింది. ఈ అద్భుత దృశ్యం భారతదేశంలోనూ స్పష్టంగా కనిపించనుందని తెలిపింది. సాధారణంగా ఒకే క్యాలెండర్ నెలలో రెండు పౌర్ణమిలు వస్తే, అందులో రెండో పౌర్ణమి నాటి చంద్రుడిని 'బ్లూ మూన్' అని పిలుస్తారు. క్యాలెండర్ ప్రకారం ఇది ప్రతి రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. మే 1వ తేదీన మొదటి పౌర్ణమి రాగా, మే 31 రెండో పౌర్ణమి రావడంతో దీనికి బ్లూ మూన్ అని పేరొచ్చింది. అయితే, 'బ్లూమూన్ ' ఉన్నంత మాత్రాన చంద్రుడు నీలం రంగులోకి మారిపోడు. ఎప్పటిలాగే తెల్లగా, ప్రకాశవంతంగానే కనిపించనుంది. ఈ బ్లూ మూన్‌కు 'మైక్రో మూన్' విశేషం కూడా తోడవ్వడమే నేటి ప్రత్యేకత. చంద్రుడు భూమి చుట్టూ తిరిగే క్రమంలో భూమికి అత్యంత దూరంలో ఉండే బిందువు (అపోజీ) వద్దకు వచ్చినప్పుడు పౌర్ణమి సంభవిస్తే దానిని మైక్రోమూన్ అంటారు. దీనివల్ల చంద్రుడు సాధారణ పౌర్ణమి నాటి పరిమాణం కంటే దాదాపు 14 శాతం చిన్నదిగా, 30 శాతం తక్కువ కాంతితో కనిపిస్తాడు. భారతదేశంలో మే 31 సాయంత్రం వేళల్లో ఈ అరుదైన మైక్రో బ్లూ మూన్‌ను ప్రజలు వీక్షించవచ్చు. అయితే, కొన్ని ప్రాంతాల్లో రుతుపవనాల ప్రభావం వల్ల ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటే మాత్రం ఆటంకం కలగవచ్చు. దశాబ్దాల తర్వాత వస్తున్న ఈ ఖగోళ సుందర దృశ్యాన్ని వీక్షించేందుకు శాస్త్రవేత్తలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

## ఫస్ట్ టైమ్ ప్రజల్లోకి విజయ్.. తిరుచ్చిలో పర్యటన




చెన్నై: తిరుచ్చి ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపేందుకు సీఎం విజయ్ సోమవారం బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందు కోసం తిరుచ్చి తూర్పు నియోజకవర్గం పరిధిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివరాలు.. సీఎం విజయ్ చెన్నై పెరంబూరు, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలలో పోటీ చేసిన విషయం తెలిసిందే. తిరుచ్చి తూర్పు నియోజకవర్గానికి ఆయన రాజీనామా చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టడం, మంత్రి వర్గం విస్తరణ, వాగ్దానాల అమలు, ఢిల్లీ పర్యటన అంటూ బిజీగా ఉన్న విజయ్ ఎట్టకేలకు తిరుచ్చి తూర్పు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు నిర్ణయించారు. ఇందుకోసం సోమవారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయ్ సీఎంగా బాధ్యలు చేపట్టినానంతరం ప్రజలలోకి ప్రథమంగా వస్తున్నారు. చెన్నై నుంచి తిరుచ్చికి విజయ్ విమానంలో వెళ్లారు. తిరుచ్చి విమానాశ్రయం టెర్మినల్ నుండి తన సొంత, ప్రత్యేక వాహనంలో (ఓపెన్ వ్యాన్)లో బయలుదేరుతారు. తిరుచ్చి--పుదుక్కోట్టై రోడ్డులోని టీవీఎస్ టోల్ గేట్, ఓల్డ్ డెయిరీ ఫామ్ ,మిల్క్ స్టేషన్ మీదుగా ప్రయాణించి సెయింట్ జోసెఫ్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. ఆయన ఓపెన్ వ్యాన్‌లో నిలబడి ప్రజలకు , కార్యర్తలకు చేతులెత్తి ధన్యవాదాలు తెలుపుతూ, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ సభలో ప్రసంగిస్తారు. ఈ పర్యటన ముగిసిన తర్వాత ఆయన తమిళనాడులోని ఇతర జిల్లాలలో కూడా పర్యటించి ప్రజలకు కృతజ్ఞతలు తెలపనున్నారని సమాచారం.

## బెంగాల్‌లో మరో సంచలనం.. మమత వార్నింగ్ ఆడియో లీక్



కోల్‌కత్తా: పశ్చిమ బెంగాల్ రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా ఆందోళనకరంగా మారాయి. తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై దాడి నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు రాళ్లు విసరడం, శారీరకంగా దాడి చేయడం వల్ల అభిషేక్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడిపై మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో కోల్‌కతాలోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రి సీఈవోకు ఆమె వార్నింగ్ ఇస్తున్న ఆడియో బయటకు వచ్చింది. దీంతో, ఇది కాస్త రాజకీయ దుమారం రేపింది. అభిషేక్ బెనర్జీపై సోనార్‌పుర్‌లో దాడి అనంతరం.. ఆయనను చికిత్స కోసం బెల్ వ్యూ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ బెల్ వ్యూ ఆసుపత్రి సీఈవో ప్రదీప్ టాండన్‌ను హెచ్చరిస్తున్న ఆడియో బయటకు వచ్చింది. 'టాండన్ మీరు తప్పుచేశారు. మేము మీకు చేసిన సాయాన్ని గుర్తుచేసుకోండి. దేవుడు మిమ్మల్ని క్షమించడు. మీ అహంకారాన్ని గుర్తుంచుకుంటాం. మీరు తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆస్పత్రిని నడుపుతున్నారు. ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉంది. తర్వాత వాళ్లు అధికారం కోల్పోతే.. మేం చేయాల్సింది చేస్తాం' అని ఆడియోలో ఉంది. అయితే, అభిషేక్ పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పటికీ.. డిశ్చార్జ్ చేయాలంటూ బీజేపీ నాయకులు, ఓ సీనియర్ పోలీసు అధికారి ఆస్పత్రిపై ఒత్తిడి తెచ్చారని మమత ఆరోపించారు. తన మేనల్లుడికి ఏమైనా జరిగితే ఆసుపత్రిదే బాధ్యత అని మండిపడ్డారు. కాగా, ప్రస్తుతం అభిషేక్ బెనర్జీకి ఇంట్లోనే చికిత్స అందిస్తున్నట్లు మమత తెలిపారు. కాగా.. ఈ దాడికి సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా.. సోనార్‌పుర్‌లో అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడి తర్వాత ఆయన ఛాతీలో రక్తపు గడ్డలు ఏర్పడ్డాయని మమత తెలిపారు. అభిషేక్‌కు హెల్మెట్ పెట్టకపోయి ఉంటే ఆయన చనిపోయి ఉండేవాడని ఆరోపించారు. ప్రజలు రాళ్లు విసరడం, శారీరకంగా దాడి చేయడం వల్ల తన మేనల్లుడి ఛాతీ, పక్కటెముకల ప్రాంతంలో గాయాలయ్యాయని పేర్కొన్నారు. అభిషేక్‌కు సరైన చికిత్స అందించకుండా ఉండేందుకు ఆసుపత్రులకు పైనుంచి ఒత్తిడి ఉందని విమర్శించారు. అలాగే, అభిషేక్ సోనార్‌పుర్ పర్యటన గురించి పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ, వారు ఎందుకు తగిన భద్రత ఏర్పాట్లు కల్పించలేకపోయారని ప్రశ్నించారు. హింసను సృష్టించేందుకే బీజేపీ బయటి వ్యక్తులను రప్పించిందని ఆరోపించారు. బీజేపీ చట్ట ప్రకారం పనిచేయాలని కోరారు. ఆస్పత్రికి వచ్చినవారిలో ఎవరికి చికిత్స చేయాలి? ఎవరికి చేయకూడదు? అనే దానికి బీజేపీ నుంచి అనుమతి కావాలని మండిపడ్డారు. అంత అమానవీయంగా బీజేపీ తయారయ్యిందని ఫైర్ అయ్యారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు కూలీల దుర్మరణం



బెంగళూరు: కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి టౌన్ సమీపంలోని జాతీయ రహదారి 44పై జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితులు బాగేపల్లి టౌన్ శివారులోని గంగోత్రి పెట్రోల్ బంక్ సమీపంలో తమ విధులు ముగించుకుని ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా, వేగంగా వచ్చిన ఒక ట్రక్కు వారి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోను ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# వైద్యం హక్కా? వ్యాపారమా?



'ఒక దేశం గొప్పదనాన్ని అంచనా వేయాలంటే అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితిని చూడాలి- అని ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన బ్రాక్ చిషోల్మ్ అంటారు. ఈ వ్యాఖ్య నేటి భారతదేశ పరిస్థితికి అద్దం పడుతుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నది పెద్దలు చెప్పిన మాట. నేడు సంపూర్ణ ఆరోగ్యం పేదలకు అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు వుండవు. తగినంత మంది వైద్యులు వుండరు. పరికరాలు, తగిన వసతులూ అందుబాటులో వుండవు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా వసతులు వుండవు. ఫలితంగా ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల వైపు పరుగులు తీయాల్సి వస్తోంది. 'వైద్యో నారాయణ- అంటారు గానీ, ఇక్కడి వైద్యం ఒక సేవగా కాకుండా వ్యాపారంగా మారడంతో... సామాన్యుడి జీవితం దుర్భరమవుతోంది. అనారోగ్యం ఒక మనిషిని మాత్రమే కాదు, ఒక కుటుంబాన్ని, కొన్నిసార్లు వారి భవిష్యత్తును కూడా అప్పుల ఊబిలోకి నెట్టేస్తుంది. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు విద్య, వైద్యాన్ని ప్రాథమిక హక్కులుగా గుర్తించి, ఉచితంగా లేదా అత్యల్ప ఖర్చుతో అందిస్తున్నాయి. కానీ మన దేశంలో మాత్రం కార్పొరేట్ ఆసుపత్రుల ఆకాశహర్మ్యాలు పెరుగుతున్న కొద్దీ పేదల గుండెల్లో భయం కూడా పెరుగుతోంది. అనారోగ్యం సంభవిస్తే ప్రాణం పోతుందో, ఆస్తి పోతుందో తెలియని పరిస్థితి. దేశంలో సామాన్యుడికి వైద్యం మరింత భారంగా మారిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'నేషనల్ హెల్త్ అకౌంట్స్ నివేదిక- స్పష్టంగా చెబుతోంది. ప్రజలు తమ ఆరోగ్య అవసరాల కోసం సొంత జేబు నుంచి చేసే ఖర్చు 2021-22 నాటికి 39.4 శాతం వుండగా, 2022-23 నాటికి 43.4 శాతానికి పెరిగింది. ఇది కేవలం నివేదిక చెప్పిన గణాంకాలు కాదు. లక్షలాది కుటుంబాల కన్నీటి కథలు. కుటుంబంలో ఒకరికి అనారోగ్యం వస్తే- చేతిలో డబ్బులేకపోతే... బంగారం అమ్ముకోవడం, భూమి తాకట్టు పెట్టడం, అప్పుల కోసం గడపగడప తిరగడం వంటి దుస్థితులకు ఈ నివేదికే సాక్ష్యం. కోవిడ్ మహమ్మారి మనకు ఒక గొప్ప పాఠం నేర్పింది. బలమైన ప్రభుత్వ వైద్య వ్యవస్థ లేకుండా ఏ దేశమూ సురక్షితంగా ఉండలేదని ప్రపంచం గుర్తించింది. కానీ కరోనా తర్వాత ప్రజారోగ్య రంగానికి నిధులు తగ్గించడం దూరదృష్టి లోపించడమే. రోడ్లు, భవనాలు, ప్రాజెక్టులు, పరిశ్రమలు ఎంత ముఖ్యమైనవో, ప్రజల ఆరోగ్యం అంతకంటే ముఖ్యమైనది. ఆరోగ్యవంతమైన ప్రజలే దేశానికి అసలైన సంపద. అయితే, కేంద్రప్రభుత్వం ప్రజా వైద్యాన్ని క్రమంగా గాలికొదిలేయడంతో ప్రజలపై అదనపు భారం పడింది. దీంతో దేశ మొత్తం ఆరోగ్య వ్యయంలో ప్రజలు తమ సొంత నగదును అప్పు చేసైనా ఖర్చు చేసుకోవాల్సి వస్తుంది.బిఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఉన్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రులు వాటిని సరిగ్గా అమలు చేయకపోవడం, లేదా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వంటి సమస్యల వల్ల పేదలకు పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరడం లేదు. బి వైద్యం ఎవరి దయాదాక్షిణ్యాలపైనో ఆధారపడే సంక్షేమ పథకం కాదు; ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. ప్రజల ఆరోగ్యాన్ని కార్పొరేట్లకు అప్పగించిన పాలకులు, ఎంత గొప్ప అభివృద్ధి కథలు చెప్పుకున్నా... అది అసంపూర్ణమే. దేశ భవిష్యత్తు కాంక్రీట్ నిర్మాణాల్లో కాదు, ఆరోగ్యవంతమైన పౌరులలో ఉంటుంది. బడ్జెట్‌లో వైద్యానికి ఖర్చు పెట్టడం వ్యయం కాదు; అది భవిష్యత్తుపై పెట్టుబడి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలేని అభివృద్ధి, అభివృద్ధే కాదు. గర్భిణీలను డోలీల్లో మోసుకుంటూ వాగులు దాటి ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సిన దుస్థితి నేటికీ కొనసాగుతుందంటే, అది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు; ప్రజల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. అంతేకాదు, వైద్య విద్య సైతం పేదలకు అందుబాటులోకి రావాలి. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందాలి. ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రత్యామ్నాయంగా నిలబడాలి. నేడు దేశం అడుగుతున్న ప్రశ్న ఒక్కటే --- వైద్యం హక్కా? వ్యాపారమా? అని. ఈ ప్రశ్నకు పాలకులు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. ప్రజల జేబులు కాదు, ప్రభుత్వ విధానాలే ఆరోగ్య భారాన్ని మోయాలి. అదే నిజమైన సంక్షేమ రాజ్యం. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనుకునే జనం... 'నేను పోత బిడ్డో సర్కారు దవాఖానకు' అనే పరిస్థితి రావాలి. అదే ప్రజాస్వామ్యానికి ప్రాణం.

# 6-23 నెలల పిల్లల్లో పెరుగుతున్న పోషకాహార లోపం : జాతీయ ఆరోగ్య సర్వే



న్యూఢిల్లీ : భారతదేశంలో పిల్లల పోషణకు సంబంధించి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ హెచ్ ఎఫ్ ఎస్-6) ఇటీవల వెల్లడించిన గణాంకాలు ఆందోళనకరమైన వివరాలను వెల్లడించాయి. 6 నుండి 23 నెలల వయస్సు గల పిల్లలలో కేవలం 15.3శాతం మంది మంది మాత్రమే తగినంత పోషకాహారం పొందుతున్నారని తెలిపింది. నెలల వయస్సున్న చిన్నారుల్లో పోషకాహార లోపం పెరుగుతున్నట్లు తెలిపింది. గత సంవత్సరాలతో పోలిస్తే దేశంలో పోషకాహార లోపంలో కొంత మెరుగుదల కనిపించినప్పటికీ, 6-23 నెలల వయస్సు గల పిల్లలలో గణనీయమైన సంఖ్యలో ఇప్పటికీ తగినంత ఆహారం లభించడం లేదు. ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -5లో 11శాతంగా ఉన్న 6-23 నెలల వయస్సు గల పిల్లల నిష్పత్తి, ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -6లో 15.3శాతానికి పెరిగాయని గణాంకాలు తెలిపాయి. పిల్లలకు తగినన్ని కేలరీలు అందుతున్నప్పటికీ, వారి పెరుగుదలకి అవసరమైన ప్రోటీన్లు, సూక్ష్మపోషకాలు, పోషకాలు అధికంగా ఉండే ఆహారం తగినంతగా అందడం లేదని నిపుణులు హెచ్చరించారు. కేవలం తల్లి పాలు మాత్రమే తీసుకునే ఆరు నెలల లోపు పిల్లల సంఖ్య కూడా ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -6లో 55.8 శాతానికి తగ్గినట్లు గణాంకాలు వెల్లడించాయి. ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -5లో వారి సంఖ్య 63.7 శాతంగా ఉండేంది. తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పోషకాలు, యాంటీబాడీలు, మరియు హైడ్రేషన్‌ను సరైన సమతుల్యతతో అందిస్తాయి. అదే సమయంలో, అవి వారి అభివృద్ధి చెందుతున్న జీర్ణ , రోగనిరోధక వ్యవస్థలను ఇన్ఫెక్షన్లు, అలర్జీల నుండి కాపాడతాయి. కేవలం తల్లిపాలు మాత్రమే ఇచ్చే వారి సంఖ్య తగ్గడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, దీనిపై తక్షణమే జాతీయ స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఉందని బ్రెస్ట్‌ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా (బిపిఎన్ఐ) వ్యవస్థాపకుడు డాక్టర్ అరుణ్ గుప్తా అన్నారు. ఇది ప్రజారోగ్యం, పోషణ, బాలల హక్కులు, జాతీయ అభివృద్ధికి సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. తల్లులు పిల్లలకు పాలిచ్చేలా వ్యవస్థలను పునర్నిర్మించడానికి భారతదేశం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -6 ఫలితాలు స్పష్టంగా చూపిస్తున్నాయని డాక్టర్ గుప్తా అన్నారు. అయితే ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ లో తల్లిపాలతో పాటు ఘనాహారాన్ని పొందుతున్న 6--8 నెలల వయస్సు గల పిల్లల నిష్పత్తి 45.9శాతం నుండి 59.5శాతానికి పెరిగినట్లు గణాంకాలు తెలిపాయి. ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -5 (2019--21) మరియు ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -6 (2023--24) మధ్య చేసిన పోలిక ప్రకారం, పిల్లలలో పోషకాహార లోపాన్ని తగ్గించడంలో భారత్ పురోగతి సాధించినప్పటికీ.. సవాళ్లు ఇంకా గణనీయంగానే ఉన్నాయి. ఐదేళ్లలోపు పిల్లలలో వయస్సుకు తగినంత ఎత్తు లేకపోవడం(స్టంటింగ్) ప్రాబల్యం ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -5లోని 35.5 శాతం నుండి ఎన్ ఎఫ్ హెచ్ ఎస్-6లో 32.3 శాతం కి తగ్గింది. తీవ్రమైన పోషకాహార లోపానికి సూచిక అయిన 'వేస్టింగ్' (ఎత్తుకు తగినంత బరువు లేకపోవడం) 19.3 శాతం నుండి 16.3 శాతానికి తగ్గగా, తీవ్రమైన వేస్టింగ్ 7.7శాతం నుండి 5.7శాతానికి తగ్గింది. తక్కువ బరువు ఉన్న పిల్లల (వయస్సుకు తగినంత బరువు లేకపోవడం) నిష్పత్తి కూడా 32.1శాతం నుండి 29.2 శాతానికి తగ్గింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) ప్రకారం, 6--24 నెలల వయస్సు పిల్లల పెరుగుదల, మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైన కాలం. అయితే ఆరు నెలల వయస్సు నుండి, కేవలం తల్లిపాలు మాత్రమే సరిపోవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలకు రెండేళ్ల వయస్సు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు తల్లిపాలు ఇవ్వడాన్ని కొనసాగిస్తూనే, సురక్షితమైన, పోషకాలతోనిండి, వైవిధ్యభరితమైనఅనుబంధఆహారాలనుఅందించాలని సూచిస్తున్నారు.

# జెన్ - జీ గళం వినిపిస్తోందా?




భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా కలిగిన దేశమని పాలకులు గర్వంగా చెబుతుంటారు. ' యువతే దేశానికి వెన్నెముక ', 'యువశక్తి దేశ భవిష్యత్తు', వంటి పదాలను వేదికలపై పదేపదే వినిపిస్తుంటారు. కానీ అదే యువత ఈ రోజు ఉద్యోగాల కోసం వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? విద్య పూర్తిచేసి సంవత్సరాలు గడిచినా ఉద్యోగం దొరకక నిరాశలో మగ్గుతున్న యువకులు ఎందుకు పెరుగుతున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. ప్రస్తుతం దేశంలో జెన్-జీ (+వఅ ్ర)గా పిలవ బడుతున్న యువతరం రాజకీయంగా, సామాజి కంగా గత తరాల కంటే ఎక్కువ అవగాహన కలిగి ఉంది. సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచ పరిణామాలను గమనిస్తున్న ఈ తరం కేవలం నినాదాలతో సంతృప్తి చెందడం లేదు. వారికి ఉద్యోగాలు కావాలి, నాణ్యమైన విద్య కావాలి, సమాన అవకాశాలు కావాలి, జీవన భద్రత కావాలి. కానీ పాలకుల నుంచి వినిపిస్తున్నది మాత్రం భారీ హామీలు, ప్రచార ఆర్భాటాలు, ఎన్నికల వాగ్దానాలే. గత కొన్నేళ్లుగా నిరుద్యోగం భారత యువతను వేధిస్తున్న ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ రంగ ఉద్యోగాల భర్తీలు తగ్గడం, ఖాళీలు ఉన్నా నియామకాలు జరగకపోవడం, పరీక్షల నిర్వహణలో జాప్యం, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామక ప్రక్రియలలో పారదర్శకత లోపించడం వంటి అంశాలు యువతలో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నాయి. లక్షల మంది అభ్యర్థులు ఒక ఉద్యోగానికి పోటీ పడుతున్న దృశ్యాలు దేశ అభివృద్ధి కథనానికి విరుద్ధమైన వాస్తవాన్ని చూపుతున్నాయి. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా జరిగిన యువజన నిరసనలు ఈ అసంతృప్తికి ప్రతిబింబం. రైల్వే ఉద్యోగాలు, సైనిక నియామకాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు వంటి అంశాలపై యువత వీధుల్లోకి రావడం యాదృచ్ఛికం కాదు. ఇది అవకాశాలు కోల్పోతున్న ఒక తరం వ్యక్తం చేస్తున్న ఆవేదన. కానీ ఈ నిరసనలను వినాల్సిన పాలకులు వాటిని రాజకీయ కోణంలో చూడడం, ప్రశ్నించే యువతను విమర్శించడం ఆందోళనకర పరిణామం. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములుగా చూడాల్సిన ప్రభుత్వం, వారిని కేవలం ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా మాత్రమే చూడడం ప్రమాదకరం. ఉద్యోగాల గురించి ప్రశ్నిస్తే దేశభక్తి పాఠాలు చెప్పడం, జీవనోపాధి గురించి అడిగితే అభివృద్ధి గణాంకాలు చూపించడం సమస్యలకు పరిష్కారం కాదు. ఆకలి, నిరుద్యోగం, అసమా నతలు గణాంకాలతో తగ్గవు. వాటికి అవసరమైనది సమర్థమైన విధానాలు. ఇటీవలి రాజకీయ పరిణామాలు కూడా యువతలో అనేక ప్రశ్నలను లేవనెత్తుతు న్నాయి. పాలకుల విధానాలపై అసంతృప్తికి తాజా ప్రతీకగా నిలిచింది 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి). మొదట ఇది ఒక వ్యంగ్య రాజకీయ- సామాజిక ఉద్యమంగా ప్రారంభ మైంది. నిరుద్యోగ యువతను 'కాక్రోచ్లు', 'పరాన్న జీవులు'గా అభివర్ణించారన్న ఆరోపణల నేపథ్యంలో సోషల్ మీడియాలో యువత ఆగ్రహం వ్యక్తమైంది. ఆ ఆగ్రహం క్రమంగా ఒక డిజిటల్ ఉద్యమంగా మారింది. వ్యంగ్య పోస్టులు, మీమ్స్, వీడియోలతో ప్రారంభమైన ఈ ప్రచారం కొన్ని రోజుల్లోనే కోట్లాది మంది యువతను ఆకర్షించింది. కాక్రోచ్ జనతా పార్టీ అసలు బలం దాని పేరులో కాదు, దాని వెనుక ఉన్న ఆవేదనలో ఉంది. ఉద్యోగాలు లేక, భవిష్యత్తుపై భరోసా లేక, ప్రభుత్వాల హామీలపై నమ్మకం కోల్పోతున్న ఒక తరం తన అసంతృప్తిని కొత్త భాషలో వ్యక్తం చేస్తోంది. ఇది కేవలం సోషల్ మీడియా ట్రెండ్ కాదు. యువత మనస్తత్వంలో జరుగుతున్న మార్పుకు సంకేతం. నేడు అవకాశవాద రాజకీయాలు, ప్రజా సమస్యల కంటే ప్రచార రాజకీయాలకు ప్రాధాన్యత పెరగడం, కార్పొరేట్ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం లభిస్తున్నదన్న విమర్శలు యువతలో విశ్వాస సంక్షోభాన్ని పెంచుతున్నాయి. రాజకీయ పార్టీలు యువతను ఆకర్షించడానికి సోషల్ మీడియా ప్రచారాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, ఉద్యోగాల కల్పనకు మాత్రం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. జెన్-జీ తరం కోరుకుంటున్నది చాలా స్పష్టమైనది. వారికి మత విద్వేషాలు అవసరం లేదు. కుల, మత రాజకీయాల కంటే ఉద్యోగ భద్రత ముఖ్యం. ద్వేష ప్రసంగాల కంటే మంచి విద్య ముఖ్యం. భారీ విగ్రహాలు, ఆర్భాట ప్రాజెక్టుల కంటే ఉపాధి అవకాశాలు ముఖ్యం. వారు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు సంపాదించ డానికి సిద్ధంగా ఉన్నారు. కానీ ఆ నైపుణ్యాలకు తగిన అవకాశాలు దేశంలోనే లభించాలనుకుంటున్నారు. నేడు అనేక మంది యువకులు విదేశాలకు వలస వెళ్లేందుకు ప్రయత్నించడం కూడా దేశీయ ఉపాధి పరిస్థితులపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇంజినీరింగ్, వైద్య, సాంకేతిక విద్యల్లో ప్రతిభ కనబరిచిన యువత దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి గర్వకారణం కాదు. ఇది దేశ విధానాల వైఫల్యానికి సంకేతం. యువత శక్తిని దేశాభివృద్ధికి వినియోగించలేకపోతే, అది సామాజిక అసంతృప్తికి దారితీస్తుంది. పాలకులు గుర్తుంచు కోవాల్సిన విషయం ఏమిటంటే, జెన్-జీ తరం మౌనంగా ఉండే తరం కాదు. ప్రశ్నించే తరం. సమాచారాన్ని పరిశీలించే తరం. వాస్తవాలను పోల్చిచూసే తరం. అందువల్ల ప్రచారాలతో మాత్రమే వారిని ప్రభావితం చేయడం సాధ్యం కాదు. ఉద్యోగాల కల్పన, ప్రభుత్వ రంగ నియామకాల వేగవంతం, విద్యావ్యవస్థ బలోపేతం, స్టార్టప్లకు మద్దతు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం వంటి చర్యల ద్వారానే యువత విశ్వాసాన్ని గెలుచుకోవచ్చు. భారత యువత ఈ రోజు అడుగుతున్నది - 'మాకు భవిష్యత్తు ఎక్కడ?' ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పడం సరిపోదు. యువత ఆగ్రహం, నిరాశ, అసంతృప్తి మరింత పెరిగితే అది కేవలం ఒక వర్గం సమస్యగా మిగలదు. అది దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం కాక్రోచ్ జనతా పార్టీ వాటిపై ఆగ్రహం వ్యక్తం చేయకుండా, ముందు జెన్ - జీ ఆవేదనను అర్థం చేసుకోవాలి. లేదంటే పాలకుల మెడలు వంచే శక్తి యువతకే ఉంటుంది.

## మంత్రాలయం, గాజువాక ఘటనలపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి : మంత్రాలయం, గాజువాక ఘటనలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ రెండు వేర్వేరు ఘటనలో పలువురు మృత్యువాత పడటంపై వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రాలయం తుంగభద్ర నదిలో ఈతకు దిగిన ఘటనలో ఐదుగురు, గాజువాక రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'తుంగభద్ర నదిలో మునిగి ఐదుగురు మృతిచెందడం విషాదకరం. ఈతకు వెళ్లి ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని వైఎస్ జగన్ సంతాంప వ్యక్తం చేశారు. ఇక గాజువాక రోడ్డుప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడటంపై వైఎస్ జగన్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు వైఎస్ జగన్. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్ జగన్ కోరారు. కాగా, మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి ఐదుగురు గల్లంతైన సంగతి తెలిసింద. మంత్రాలయంలోని బంధువుల ఇంట్లో జరిగే సత్యనారాయణ స్వామి పూజకు బంధువులు హాజరయ్యారు. పూజ అయిపోయిన తర్వాత సమీపంలో ఉన్న తుంగభద్ర నదికి వెళ్లారు వారు. వారిలో ఆరుగురు ఈత కొట్టడం కోసం దిగగా, వారిలో ఆదోనికి చెందిన అపర్ణ ముందుగానే సురక్షితంగా బయటకొచ్చేసింది. మిగతా ఐదుగురు నదిలో చిక్కుకుపోయి గల్లంతయ్యారు. అక్కడ నీటి లోతు ఎంత ఉందో అంచనా వేయలేక పోవడంతో ప్రమాదం చోటు చేసుకుని ఐదుగురు గల్లంతయ్యారు. వీరి కోసం తీవ్ర గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. వారంతా విగత జీవులుగా మిగిలిపోయారు. ఈ విషాద ఘటనలో ఇద్దకు హైదరాబాద్‌కు చెందిన యువన్ చంద్ర, సతీష్‌లుగా గుర్తించగా మరో ఇద్దరిని మంత్రాలయంకు చెందిన రాఘవేంద్ర, ధనులుగా గుర్తించారు, ఉరవకొండకు చెందిన సంధ్య అనే యువతి కూడా ఉంది. మరొకవైపు ఈరోజు(ఆదివారం, మే 31) ఉదయం గాజువాకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సుఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. పలువురికి గాయాలు కాగా, వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. రాజమండ్రి నుంచి పార్వతీపురం వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

## కేసులకు, బెదిరింపులకు భయపడం



తాడేపల్లి: కేసులకు, బెదిరింపులకు తాను బెదిరిపోనని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 'చంద్రబాబు మోసానికి' రెండేళ్లు పేరిట పార్టీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మహానాడు సాక్షిగా అబద్ధాలు,మహిళలకు చేసిన మోసంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా విడదల రజిని మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే వేధింపులు.. సూపర్ సిక్స్ హామీని గాలికొదిలేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన మెడికల్ కాలేజీని అమ్మకానికి పెట్టారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని ఆటకెక్కించారు. చంద్రబాబు మోసాలు,అన్యాయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్దాం. బాబును భూస్థాపితం చేయడం మహిళలకే సాధ్యం'అని అన్నారు

## 'బడేభాయ్ చెప్పినట్టు రేవంత్ నడుస్తున్నట్లు కనిపిస్తోంది'



సిద్ధిపేట: ఉచిత విద్యుత్ కరెంట్ విషయంలో బడేభాయ్ చెప్పినట్టు సీఎం రేవంత్ నడుస్తున్నట్లు కనిపిస్తోంది. డిస్కంల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నది వేరు.. వాస్తవం వేరని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం (మే29) సిద్ధిపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. 24గంటల విద్యుత్ ఇవ్వడం కోసమే రైతు డిస్కం ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ అంటున్నారు. కానీ వాస్తవం ఏంటంటే? రైతు డిస్కంతో 24 గంటల ఉచిత విద్యుత్ రానే రాదు. రైతు డిస్కం రైతులకు ఉరి తాడుగా మారబోతుంది. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పాలిట రైతు డిస్కం శాపంగా మారుతుంది. మేం పద్దతిగా ఆధారాలతో మాట్లాడుతాం. రేవంత్ రెడ్డిలా బట్ట కాల్చి మీద వేయం. ఆర్పీడీసీఎల్ ఏర్పాటుతో కనీసం ఏడు గంటల కరెంట్ కూడా రాదు. 13గంటలకు మించి రైతులకు కరెంట్ రావడం లేదు. రైతులకు మూడు గంటలు కరెంట్ చాలు అని కోదండరెడ్డి మాట్లాడుతున్నారు. గుజరాత్‌లో రైతులకు ఏడుగంటలే కరెంట్ ఇస్తున్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చే ఓట్లు అడుగుతానని రేవంత్ చెప్పాలి. రేవంత్ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్‌కు మంగళం పాడింది. టీజీఆర్పీడీసీఎల్ థర్మల్ పవర్ ఇవ్వరట.. సోలార్ పవర్ మాత్రమే ఇస్తారట. బడేభాయ్ చెప్పినట్టు రేవంత్ నడుస్తున్నట్లు కనిపిస్తోంది. వరద వచ్చినప్పుడే ప్రాజెక్టులు నింపుకోవాలి' అని వ్యాఖ్యానించారు.

## ఆగని యుద్ధం.. ఆర్థిక మాంద్యంలోకి ప్రపంచం?!




వాషింగ్టన్ : పశ్చిమాసియాలో శాంతి ఒప్పందాల ప్రయత్నాలు విఫలమవడంతో అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ మేఘాలు మరింత కమ్ముకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కఠిన షరతుల నేపథ్యంలో ఈ సంక్షోభం మరింత సుదీర్ఘంగా సాగేలా కనిపిస్తోంది. కీలకమైన హర్మూజ్ జలసంధి మూసివేత భయాలు, ఇంధన ధరల పెరుగుదల వల్ల ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక మాంద్యం దిశగా అడుగులు వేస్తున్నాయని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియాలో శాంతి ఒప్పందం దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాము ఎలాంటి అణు ఆయుధాలను తయారు చేయబోమని ఇరాన్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి తన కోడలు లారా ట్రంప్ నిర్వహించిన 'ఫాక్స్ న్యూస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'నాకు కావలసిన ఒకే ఒక్క గ్యారెంటీ, ఇరాన్ అణు ఆయుధాలను తయారు చేయకూడదు. అందుకు వారు అంగీకరించారు, ఇది చాలా ఆసక్తికరమైన విషయం' అని పేర్కొన్నారు. మరోవైపు, న్యూయార్క్ టైమ్స్, యాక్సియోస్ మీడియా సంస్థల కథనాల ప్రకారం.. శాంతి ఒప్పందం పేరిట ట్రంప్ ఇరాన్‌కు అత్యంత కఠినమైన నిబంధనలతో కూడిన కొత్త ప్రతిపాదనలను పంపారు. అయితే ఈ కొత్త షరతుల కారణంగా పశ్చిమాసియాలో అధికారికంగా యుద్ధం ముగింపు, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి పట్టే మరింత సమయం పట్టే అవకాశం ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ముగింపు ఒప్పందంలో భాగంగా 'లెబనాన్'ను కూడా చేర్చాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఇజ్రాయెల్ దళాలు దక్షిణ లెబనాన్‌లోకి 30 కిలోమీటర్ల మేర చొచ్చుకెళ్లి దాడులను తీవ్రం చేసిన నేపథ్యంలో ఇరాన్ ఈ డిమాండ్ తెరపైకి తెచ్చింది. దీంతో పాటు వ్యాపార పరంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే ఓడలపై ఇరాన్ ఎలాంటి పన్నులు వసూలు చేయకూడదని ట్రంప్ ప్రతిపాదించగా, అలాంటి నిబంధన ఏదీ ఒప్పందంలో లేదని ఇరాన్ మీడియా సంస్థ 'ఫార్స్' కొట్టిపారేసింది. అంతేకాకుండా, సదరు జలసంధిపై తమ పూర్తి సార్వభౌమాధికారాన్ని చాటే బిల్లును ఇరాన్ పార్లమెంట్ త్వరలోనే ఆమోదించబోతోందని స్పష్టం చేసింది. తమ అణు కార్యక్రమంపై అమెరికాతో కీలక చర్చలు ప్రారంభించడానికి ముందే, గతంలో అమెరికా స్తంభింపజేసిన తమ 12 బిలియన్ డాలర్ల ఆస్తులను తక్షణమే విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్ చేసింది. అదే సమయంలో, ఇరాన్ దగ్గర ఉన్న శుద్ధి చేసిన యురేనియంను నాశనం చేస్తామంటూ ట్రంప్ మునుపు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ అధికారిక వర్గాలు తోసిపుచ్చాయి. ట్రంప్ వాదనలపై టెహ్రాన్ (ఇరాన్) మొదటి నుంచి సందేహాలు వ్యక్తంచేస్తుండటంతో, కీలక ప్రాధాన్యతల విషయంలో ఇరు పక్షాల మధ్య ఇంకా చాలా వ్యత్యాసాలు కొనసాగుతున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.

# ఈడి-మోడీ మిలాఖత్!


'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా' అన్నట్లు, బీజేపీ అనుకోవాలేగానీ ఏదైనా చేస్తుందన్నది పాతపడిన విద్యే. ఎన్ఐఏ, ఈడి, ఐటి, సిబిఐ వంటి సంస్థలను ఎగదోసి వ్యతిరేకించే ప్రతిపక్ష నేతల నివాసాలపై దాడులు చేయిస్తుంది. అరెస్టులు చేసి జైల్లో పెడుతుంది. మీడియా, సంస్థల్ని కూడా ఇదే తీరుగా బెదిరింపులకు గురిచేస్తుంది. కేరళం తాజా మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) అగ్రనేత పినరయి విజయన్ ఇంటితోపాటు కుటుంబ సభ్యుల నివాసాలపై బుధ వారం నాడు పన్నెండు చోట్ల ఈడి సోదాలు చేసింది. అదేమి పట్టుకుందో, ఏం వెలికితీసిందో తెలియదు. కానీ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ కూటమి విజయన్ ప్రభుత్వంపై చేయని ఆరోపణ లేదు. ఎంతగా దిగజారిందంటే 'ఆయన్ను ఎందుకు అరెస్టు చేయటం లేదు?' స్వయంగా రాహుల్గాంధీ ప్రశ్నించటాన్ని కేరళం పౌరులు చూశారు. బీజేపీతో సీపీఐ(ఎం) కుమ్మక్కు అయినందునే ఆ పని చేయలేదని దుష్ప్రచారం చేశారు. ఒక కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టిన విజయన్ పోరాట వీరుడు, మచ్చలేని నేత. కన్నూరు జిల్లాలో శ్రామికుల తరపున కమ్యూనిస్టులు నిర్వహించిన మహత్తర పాత్ర యావత్ ప్రపంచానికి తెలుసు. యువకుడిగా కష్టజీవుల కోసం నిలిచిన నాటి నుంచి విజయన్పై జరగని దాడి లేదు.అనేక సార్లు ప్రాణాలు తీసేం దుకు చూసిన శక్తులు ఇప్పుడు పరువు తీసేందుకు ఈ దాడి చేయించాయని వేరే చెప్పనవసరం లేదు. కన్నూరు ప్రాంతంలో ఒక వైపు కాంగ్రెస్, మరోవైపు ఆరెస్సెస్ మూకలు నిత్యం కమ్యూనిస్టులను అణచివేసేందుకు చేసిన యత్నాలను స్వయంగా ఎదుర్కొన్ననేత విజయన్, బీజేపీతో చేతులు కలుపుతారా? సూర్యుడి మీద ఉమ్మివేస్తే వేసినవారి మీదే పడుతుంది. గతంలో మంత్రిగా చేసినపుడు విజయన్ మీద కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలు ఒక్కటీ రుజువు కాలేదు. పోరుబాటలో మడమ తిప్పకుండా ముందుకు పోతున్న విజయన్కు కేసులు కొత్తకాదు, ఈ దాడులతో ఆయన ప్రతిష్ట మసకబారేదీ లేదు. జర్మన్ గోబెల్స్ మాదిరి కాంగ్రెస్ నేతల దిగజారుడు ప్రచారం, బీజేపీ ఆచరణ వెనుక పెద్ద కుట్రేదాగి ఉందని ఇప్పుడు ఈ సోదాలు తేటతెల్లం చేశాయి. నిజంగా బీజేపీతో చేతులు కలిపి ఉంటే ఈడి దాడులు జరిగేవా? బుర్రలో గుజ్జున్న ప్రతి ఒక్కరూ నేడు ఆలోచిస్తున్నారు. దేశంలో, వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అవకాశవాద, దిగజారుడు రాజకీయాల గురించి చెప్పనవసరం లేద. మద్యం కుంభకోణం పేరుతో తప్పుడు కేసు పెట్టి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రివాల్, మంత్రులను నెలల తరబడి జైల్లో పెట్టినపుడు బీజేపీ ఆరోపణలకు కాంగ్రెస్ వంతపాడింది. అలాంటి పార్టీ కేరళంలో తమకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న సీపీఐ(ఎం) నేతలపై తప్పుడు ఆరోపణలు చేయటంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి పార్టీ ఇండియా కూటమిలో పెద్ద పక్షంగా ఉండి బీజేపీకి పరోక్షంగా సాయం చేయటం



తప్ప ఆ కూటమిని ముందుకు తీసుకుపోతుందా! విజయన్పై దాడిని ఎంకె స్టాలిన్, కేజ్రివాల్, తేజస్వీ యాదవ్, డి.రాజా వంటి ఎందరో ఖండించారు. ఈడి మీద దాడికి పాల్పడ్డారనే పేరుతో మూడు వందల మంది సీపీఐ(ఎం) కార్యకర్తలు, అభిమానుల మీద కేరళం కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టి అనేక మందిని అరెస్టులు చేసింది. అయినప్పటికీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపారు. ఈడి దాడులతో కేరళం నివ్వెరపోయింది. అసలు ఆ సంస్థ ముందుగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని రాష్ట్ర డిజిపి చెప్పటం రాష్ట్ర ప్రభుత్వాన్ని కాపాడే నాటకం తప్ప మరొకటి కాదు. అదే గనుక నిజమైతే కాంగ్రెస్ నేతలు కేంద్ర సంస్థ చర్యను ఎందుకు తప్పుపట్టలేదు. ఇంతకూ విజయన్పై దాడి ఎందుకు చేసినట్లో తెలుసా! కేవలం కోటీ 72లక్షల రూపాయల మేరకు అవినీతి జరిగిందనే పేరుతో చేసిన దాడులు. విజయన్ కుమార్తె వీణ అనేకమంది మాదిరే బెంగళూరులో ఎక్సా లాజిక్ కన్సల్టెన్సీ అనే ఒక చిన్న కంపెనీ పెట్టుకున్నారు. 2017 నుంచి 2020 వరకు ఆ కంపెనీ ఒక ప్రభుత్వ సంస్థకు సాఫ్ట్వేర్ సేవలను అందించి నందుకు ఈ నగదు పొందిందన్నది ఆరోపణ. ఇప్పుడా కంపెనీ అసలు ఎలాంటి కార్య కలాపాలు నిర్వహించటం లేదు. అవినీతి డబ్బు చేతులు మారిందని గతంలో కాంగ్రెస్ ఆరోపించింది, ఇప్పుడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒకరు ఈడికి ఫిర్యాదు చేశారు. కంపెనీని మూసివేసిన ఆరేండ్ల తరువాత ఈడి దాడులు చేసింది. దీనర్థం ఇప్పుడు చేయవద్దని కాదు, జనం సొమ్ము ఎంతైనా సరే విచారణ జరపాల్సిందే. లావాదేవీలన్ని చట్టబద్ధంగానే జరిగాయి గనుక వాటిని దాచేందుకేమీ ఉండదు. ఎందరో ఘరానా పెద్దలు, కార్పొరేట్ల అధిపతులు, వందలు, వేల కోట్ల రూపాయల కుంభ కోణాలకు పాల్పడి ఎలా తప్పించుకుంటున్నారో తెలిసిందే. అలాంటి వారు బీజేపీలో చేరినా, ఆ పార్టీకి ఎన్నికల బాండ్లో, మరోపేరుతోనో వందల కోట్లు నిధులు ఇచ్చినా 'వాషింగ్ పౌడర్ నిర్మా' తంతు తెలిసిందే. రెండోసారి అసోం సీఎం హిమంత బిశ్వశర్మ కాంగ్రెస్నేతగా ఉండగా బీజేపీ పెట్టిన చార్జిషీటు గురించి, ఇప్పుడు బెంగాల్ బీజేపీ సీఎంగా పీఠమెక్కిన సువేందు అధికారి గురించి స్వయంగా మోడీ చేసిన అవినీతి ఆరోపణల గురించి ఏ కేంద్ర దర్యాప్తు సంస్థా ఎలాంటి దాడులు చేయలేదు.అందుకే ఏనుగులు దూరే కంతలను వదలి దోమలు దూరేవాటి దగ్గర కూర్చున్నట్లుగా ఈడి తీరు ఉంది!

# ఎండ ప్రచండం


తెలంగాణ రాష్ట్రంలో ఈసారి మండుటెండలు మరణ మృదంగాన్నీ సృష్టిస్తు న్నాయి. అనేక జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 'సీవియర్ హీట్వేవ్' నమోదు చేస్తున్నాయి. చాలాచోట్ల ఎండ వేడి తట్టుకోలేక జనాలు పిట్టల్లా రాలుతున్నారు. ఒకరోజు యాభై ఒక మంది, మరుసటి రోజు ఇరవై రెండు మంది, ఇంకోరోజు ముప్పయి మంది, ఇలా ఈ మూడు రోజుల లెక్కల్ని వింటేనే గుండె తరుక్కుపోతోంది. మృతులు వందకు పైగా దాటడం తీవ్ర విషాదకరం. ఉదయం పనికెళ్లిన మనిషి సాయంత్రానికి శవంగా ఇంటికి రావడం, 'కొద్దిసేపట్లో వస్తా'నని బయలుదేరిన తండ్రి దారిలోనే కుప్పకూలడం విచారకరం. ఇలాంటి దారుణమైన పరిస్థితుల్లో పొద్దంతా చెమటోడిస్తేగానీ ముద్ద నోట్లోకి వెళ్లని శ్రమజీవుల సంగతేమిటి? ఈ వేసవిలో వారి బతుకు చిత్రం ఒక్కసారిగా ఆందోళనకరంగా మారింది. ఇంట్లో ఉంటే పూట గడవదు, బయటకు వెళ్తే మరణం తప్పదన్న దుస్థితి ఎదురైతే వారు ఎవరికి చెప్పుకోవాలి? వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో నలభై ఆరు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్దపల్లి జిల్లాలో నలభై ఏడు డిగ్రీలు అత్యధికం. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసింది. ఉదయం తొమ్మిది గంటలకే జనం బయట అడుగుపెట్టడం లేదు. మధ్యాహ్నం అయితే గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. పట్టణాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కానీ పొలాల్లో పనిచేస్తున్న రైతులు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు ఈ ఎండల్లో కుప్పకూలుతున్న దయనీయ స్థితి నెలకొంది. ఎందుకంటే, పేదరికం వారిని ఇంట్లో ఉండనివ్వదు. ఆకలి వాళ్లను ఎండలోకి నెట్టేస్తోంది. చివరకు అదే ఎండ వారి ప్రాణాలను కూడా మింగేస్తోంది. ఈ విపత్కర పరిస్థితులకు కారణాలను విశ్లేషిస్తే ఒకటి ఎల్నినో ప్రభావం, రెండోది కార్పొరేట్ల ధనదాహం. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. భారత దేశంలో ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాల్లో తీవ్రమైన వేడి తరంగాలు నమోదవు తున్నాయి. కానీ, ప్రకృతి ఒక్కటే కాదు. చెట్ల నరికివేత, చెరువుల మాయం, కాంక్రీట్ నగరాల పెరుగుదల, పచ్చదనం తగ్గిపోవడం కూడా ఈ వేడిని మరింత భయంకరంగా మార్చేస్తున్నాయి. అయితే, ఈ వినాశనంలో పాలకవర్గాల పాత్ర ప్రధానం. లాభాల కోసం ప్రకృతిని విచక్షణా రహితంగా దోచుకుంటున్న కార్పొరేట్ విధానా లు, వాటికి అనుగుణంగా రూపొందుతున్న ప్రభుత్వ నిర్ణయాలే పర్యావరణ సంక్షోభాన్ని అసలు కారణాలు. వేలాది ఎకరాల అడవిని ఆదానీ, అంబానీ లాంటి ప్రయివేటు కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారు. వారేమో ఖనిజ సంపదకోసం లక్ష?లాది చెట్లను నరికేస్తున్నారు. దీంతో అడవులు కనుమరుగవుతున్నాయి. ఇంకా, గనుల తవ్వకాలు,



థర్మల్ విద్యుత్ కేంద్రాలు, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక కారిడార్లు, ప్రత్యేక ఆర్థిక మండలాల కోసం లక్షల ఎకరాల భూమి వినియోగిస్తున్నారు. ఇదే వాతావరణ సమతుల్యతను దెబ్బతీసి భూమి ఉష్ణోగ్రతలను పెంచుతోంది. ఏడాదికేడాది ఎండలు పెరుగుతున్నా, ప్రభుత్వాల సిద్ధత మాత్రం పాత స్థాయిలోనే ఉంది. అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే? వడదెబ్బతో చనిపోతున్న వాళ్లలో ఎక్కువ మంది పేదలే. ఏసీ గదుల్లో ఉండేవాళ్లు కాదు. రోజు పనిచేసి కుటుంబాన్ని పోషించుకునే రైతులు, కూలీలు, ఆట్రోడైవర్లు. ఇప్పుడు చనిపోయిన వారిలో కూడా వారే ఎక్కువ. అంటే ఈ మరణాలకు కారణం కేవలం సూర్యుడి వేడి కాదు, సామాజిక అసమానత కూడా అందులో దాగుంది. అయినా, పర్యావరణం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఒకప్పుడు గ్రామాల్లో పెద్దపెద్ద చెట్లు ఉండేవి. ఇపుడు వాటి స్థానంలో సిమెంట్ గోడలు వచ్చాయి. పట్టణాల్లో బస్టాప్లకు సరైన షెడ్లు కూడా లేవు. చలివేంద్రాలు కనిపించడం కూడా అరుదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కోవాలి. పట్టణాభివృద్ధి పేరుతో చెట్లను నరికి వేసి, తర్వాత 'హరితహారం' పేరుతో మొక్కలు నాటితే సరిపోదు. పర్యావరణాన్ని కాపాడకుండా ఈ వేడి సంక్షోభం తగ్గదు. చెరువులు,పార్కులు, పచ్చదనం పెరగాలి. అందుకు బృహత్తర కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి. ఎందుకంటే, దేశమే కాదు, మన రాష్ట్రమూ ప్రమాదకర అంచున నిలబడి ఉంది. ఎండలు ప్రతిసంవత్సరం వచ్చేవే. కానీ,గతేడాదితో పోలిస్తే ఈ సారి మరణాలు రెట్టింపు పెరిగాయి. ఈ ఒక్కో మరణం వెనుక కుటుంబ శోకం, దాని వెనుక పిల్లల ఆర్తనాదాలు ఉన్నాయి. ఇప్పటివరకు చనిపోయిన వారి కుటుంబాలను ప్రకృతి విపత్తుల కింద ప్రభుత్వాలు ఆదుకోవాలి. ఇది ప్రకృతి, పాలన కలిపి సృష్టించిన సంక్ష?భం. దీనికి అడ్డుకట్ట వేయకుంటే, రోజురోజుకూ వార్తల్లో మరణాల సంఖ్య మారుతుంది. కానీ, పేదల ఇళ్లలో వినిపించే ఏడుపు మాత్రం అలాగే ఉంటుంది. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలు ప్రభుత్వాలను క్ష?మించవు.

# నీచత్వానికి నీరాజనమా!

ధర్మం, సనాతనం, హిందూ, సంస్కృతి అని నిత్యం గొంతు చించుకుని, కాషాయ జెండాలతో, కండువాలతో చెలరేగుతూ తిరుగుతున్న వాళ్ల గుంపు మనిషే కదా ఇతనూ! ఎందుకింత అరాచకం! హిందూరాష్ట్రం ఏర్పడాలని కోరుకుంటున్నది ఇందుకోసమేనా? ఎవరూ మాట్లాడరేమి? సంఘీయులుగానీ, బీజేపీ నాయకులుగానీ, ప్రభుత్వ పెద్దలు, యోగులు, పీఠాధిపతులు ఏమీ మాట్లాడరు. కనీసంగానైనా ఖండించరు. అదే ఇంకొక మతవ్యక్తి చేస్తే మాత్రం వీరంగం వేస్తారు. సిగ్గుండాలి. ఇలాంటి ఊరేగింపులు చేయటానికి, వాటిని చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టడానికి! వాళ్లేమి చేస్తున్నారో అర్థమవుతోందా! దేశంలోని కోట్లాది మంది హిందువుల పేరు చెప్పుకుని, ఆ పేరు పెట్టుకుని మానవత్వానికే మచ్చ తెస్తున్న వీరి ఆగడాలను చూస్తూ ఊరుకుంటే, అవి కొనసాగుతూనే ఉంటాయి. అది ఉత్తరప్రదేశ్ లోని ఘజియాబాద్. అక్కడి జైలు వెలుపల పెద్దఎత్తున హిందూవాహిని సమూహం గుమిగూడి పెద్ద పెద్దగా అరుస్తూ నినాదాలిస్తున్నది. అందరూ కాషాయ కండువాలతో, జెండాలతో ఉన్నారు. జై కొడుతున్నారు. జైలు నుండి బయటకు వచ్చిన ఒక వ్యక్తిని వాళ్లు భుజాల మీదకు ఎత్తుకుని ఊరేగింపు తీస్తున్నారు. సంబరాలు చేసుకుంటున్నారు. అతను ఆనందోత్సాహాలలో ఊరేగుతున్నాడు. అతని పేరు సుశీల్ ప్రజాపతి. హిందూ యువ వాహిని మాజీ నేత. ఇతడేం స్వాతంత్ర్య సమరయోధుడు కాదు. లేదా ప్రజల సమస్యలపై పోరాడి జైలుకు వెళ్లలేదు. లేదా గొప్ప క్రికెట్లో వరల్డ్ కప్ మోసుకొచ్చినోడు కాదు. ఒక లైంగికదాడి నిందితుడు. బెయిల్పై విడుదలయిన సందర్భం అది. జైలు తలుపుల నుంచి బయటికి అడుగుపెట్టగానే పూలమాలలతో స్వాగతం పలికారు సహచరులు. హిందూవాహిని నేతలు. ఈ దృశ్యాలను వీడియో తీసి మరీ సోషల్ మీడియాలో పెట్టడంతో అది వైరల్ గా మారింది. ఒక హేయమైన నేరానికి పాల్పడిన వ్యక్తికి ఈ విధంగా హీరోలా స్వాగతం పలకడంపై అనేక మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ కాషాయాన్ని ధరించి అధికారం చేస్తున్న అక్కడి ముఖ్యమంత్రి యోగి కానీ, మంత్రులు కానీ ఏమీ మాట్లాడటం లేదు. ఇంతకీ ఈ సుశీల్ ప్రజాపతి చేసిన ఘనకార్యమేమంటే, ఘజియాబాద్ కే చెందిన 'లా' చదువుతున్న విద్యార్థినికి, మాయమాటలు చెప్పి ఓ ఫ్లాటుకు తీసుకువెళ్లి, మత్తుమందు ఇచ్చి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు, చంపుతానని బెదిరించినట్లు 2025 ఆగస్టులో కేసు నమోదయింది. ఆరోపణలు రుజువు కావడంతో పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపారు. తొమ్మిది నెలల తర్వాత మే నెల 17న ఆయనకు బెయిల్ మంజూరయింది. ఇలాంటి ఘటనలు హిందూవాహినికి కొత్తేమీ కాదు. 2017లో బరేలీలో కూడా లైంగికదాడి నేరంపై జైళ్లకు వెళ్లారు. జై హిందూ నినాదాలు చేసిన




మన రాష్ట్రంలో బండి భగీరథ్ కూడా ఇదే ఆరోపణలతో జైల్లో ఉన్న విషయం మనకు తెలుసు. ఇలాంటి ఉత్సవ సన్నివేశాలు ఇంతకు ముందు కూడా జరిగాయి. బిల్కిస్ బానోపై లైంగికదాడి, కుటుంబ సభ్యుల హత్యకేసులో శిక్షపడిన నేరస్తులను విడుదల చేసినప్పుడు కూడా ఇదే హిందూ పేరు పెట్టుకున్న సంస్థలు వారిని పూలదండలతో సత్కరించిన దౌర్భాగ్య సంఘటనను చూశాం. అంతేకాదు మహిళలపై, మైనరు బాలికలపై లైంగికదాడి, జర్నలిస్టు హత్య కేసులో జైళ్లో ఉన్న డేరా బాబాకు పెరోల్ ఇవ్వడం, బయట అతనికి నీరాజనాలు పలకడం చూస్తూనే ఉన్నాం కదా! అలాగే ఆశారాం బాబా జైల్లోనే ఉన్నాడు. వీళ్లంతా నీతి, ధర్మం అంటూ ప్రవచనాలు పలికేవాళ్లే. వీళ్లలాంటి వాళ్లు ఇంకో మతంలో ఉంటే 'లవ్ జిహాద్' అని మొత్తం మతాన్ని ద్వేషించే ప్రచారం చేస్తారు. కానీ హిందూవాహిని పేరుతో చలామణి అవుతున్న వీళ్లు చేస్తున్న ఈ నీచ పనులకు సంబంధించి విషయాలపై ఒక్క ఖండన కూడా చేయరు. అంటే సమర్థిస్తున్నట్లే కదా! అన్యాయం అని తెలిసినా ఎవరూ ఎందుకు మాట్లాడటం లేదు. మహిళలకు, అమ్మాయిలకు ఇవ్వాల్సిన గౌరవం, వ్యక్తుల ఆరాధనలో కొట్టుకుపోతోందా! ఆడవాళ్లు ఆదిపరాశక్తులని, దేవతలని, మా సంస్కృతిలో వారిని పూజిస్తామని చెప్పే మాటలన్నీ అబద్ధాలుగా నిలుస్తున్నాయి. వేల ఏండ్ల సంస్కృతి, నాగరి కతలుగా చెప్పే వీరి విలువల ప్రయాణం చాలా దారుణంగా కనపడుతోంది. గతంలో కంటే ఇదంతా ఈ పదేండ్లలో మహిళలపై దాడులు, లైంగికదాడులు, హత్యలు విపరీతంగా పెరిగాయని నేర గణాంకాలు వివరిస్తున్నాయి. దేశ పాలకులు ఒట్టి నినాదాలివ్వడం కాదు, మహిళల భద్రతకు కావలసిన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం.

EDITOR, Printed, Published and Owned by KOTLAPALLI FOUZIYAPrinted at Mis FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,SREEKANTAPURAM,HINDUPUR,SRI SATYA SAI,ANANTHAUR,ANDHPRADESH-515201.Cell7668886666Printing Press: FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,LAKSHMIPURAM,HINDUPUR,SRI SATYASAI,ANAN THAUR, ANDHPRADESH- 515201.RNI Regd No APTEL/26/A0016